RNI APTEL/25/A0798

# టుడే విదుర

జాతీయ తెలుగు దిన పత్రిక

https://www.todayvidhura.com/

ప్రచురణ: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సంపుటి : 1 సంచిక:11 29-6-2025 ఆదివారం ఎడిటర్ :మర్రి పవీణ్ పేజీలు : 8 వెల 4 /-

## మోదీకి ధర్మ చక్రవర్తి బిరుదు ప్రదానం





న్యూఢిల్లీ:(టుడే విదుర, జూన్ 28): జైన సన్యాసి ఆచార్య శ్రీ 108 విద్యానంద్ జీ మహారాజ్ శతాబ్ది ఉత్సవాలు సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కి 'ధర్మ చక్రవర్తి' బిరుదును శనివారంనాడు ప్రదానం చేశారు. ఆచార్య శ్రీ 108 విద్యానంద్ జీ మహారాజ్‌కు ఏడాది పొడవునా నిర్వహించే జాతీయ నివాళికి నాంది పలుకుతూ ఈ శతాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. జైన నేత ఆధ్యాత్మిక, పండిత వారసత్వాన్ని స్మరించుకునేందుకు కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, ఢిల్లీలోని భగవాన్ మహావీర్ అహింసా భారత్ ట్రస్టు సహకారంతో ఈ శతాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తున్నారు.ధర్మ చక్రవరి బిరుదును ప్రధాని స్వీకరిస్తూ, తనను తాను ఈ బిరుదుకు అర్హుడనని భావించడం లేదని, అయితే సాధువుల నుంచి ఏది స్వీకరించినా దానిని ప్రసాదంగా స్వీకరించాలనేది మన సంస్కృతి అని చెప్పారు. ఈ ప్రసాదాన్ని తాను వినయంగా స్వీకరిస్తూ తల్లి భారతికి అంకితమిస్తున్నానని అన్నారు.ఆచార్య విద్యానంద్ జీ 1987 జూన్ 28న 'ఆచార్య' బిరుదును అందుకున్నారని ప్రధాని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ఇది కేవలం గౌరవం కాదని, జైన సంస్కృతిని సంయమనం, కరుణతో అనుసంధానించే పవిత్ర ధార అని అన్నారు. క్రమశిక్షణ, సన్యాసి జీవితాన్ని గుర్తుచేసే వేడుకలు ఇవని పేర్కొంటూ ఆచార్యకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య శ్రీ 108 విద్యానంద్ జీ మహారాజ్ స్మారక పోస్టల్ స్టాంపును ప్రధానమంత్రి మోదీ, కేంద్ర సంస్కృతి, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ విడుదల చేశారు. దీనికి ముందు 'లైఫ్ అండ్ లెగసీ ఆఫ్ ఆచార్య శ్రీ 108 విద్యానంద్ జీ మహరాజ్' పేరుతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను మోదీ, షెకావత్ సందర్శించారు. ఆచార్య ఆధ్యాత్మిక ప్రయాణంలోని కీలక ఘట్టాలను గుర్తు చేసే కుడ్యచిత్రాలను ఈ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించారు.

## డ్రోన్ టెక్నాలజీపై రైతులకు అవగాహన కల్పించాలి : మంత్రి టీజీ భరత్



కర్నూల్ (టుడే విదుర, జూన్ 28): వ్యవసాయంలో డ్రోన్ టెక్నాలజీని విరివిగా వినియోగించుకోవాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో వాడి, వేడిగా కొనసాగింది. సమావేశంలో ప్రధానంగా వ్యవసాయం, వైద్యం, విద్యా ఇతర రంగాలపై నిర్వహించారు. మొదట వ్యవసాయంపై సమీక్ష నిర్వహించగా సభ్యులు వాడివేడిగా ప్రశ్నలు కురిపించారు. ఈ సమావేశంలో మంత్రి టీజీ భరత్ తో పాటు కర్నూలు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, నంద్యాల జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి గణియా, ఎమ్మెల్సీ మధుసూదన్, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వర యాదవ్, వాల్మీకి సంఘం చైర్మన్ బొజ్జమ్మ, కర్నూలు, నంద్యాల జిల్లాల జడ్పీటీసీలు, ఎంపీపీలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. వ్యవసాయం పై జరిగిన చర్చలో భాగంగా డ్రోన్ల మంజూరుకు సంబంధించి జిల్లాకు నిర్దేశించిన లక్ష్యం 35 కాగా, ఇందులో 17 గ్రూపులను ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా వ్యవసాయ అధికారి వివరించగా, మిగిలిన రైతు గ్రూపులను కూడా త్వరితగతిన ఏర్పాటు చేసి లక్ష్యాన్ని సాధించాలని మంత్రి జిల్లా వ్యవసాయ అధికారిని ఆదేశించారు. డ్రోన్ స్ప్రేయర్ ల వల్ల కలిగే ప్రయోజనాలు, లబ్ది గురించి మండల వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా రైతులకు అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.ఎన్టీఆర్ వైద్యసేవ పథకం ద్వారా నెట్వర్క్ ఆస్పత్రులలో రోగుల నుండి డబ్బు తీసుకుంటున్నారని ఆదోని ఎమ్మెల్యే ప్రస్తావించగా మంత్రి స్పందించి పథకం సక్రమంగా అమలయ్యేలా విజిలెన్స్ కమిటీ ని వేసి పర్యవేక్షించాలన్నారు. ప్రభుత్వ ఆసుప్రతుల్లో ఆక్సిజన్ అంశంలో లక్షలు, కోట్లు ఖర్చు పెడుతున్నారని, అంత ధర ఉందా అని ఈ అంశం మీద దృష్టి పెట్టి, వెరిఫై చేయాలని మంత్రి డీఎంహెచ్ఓ ను ఆదేశించారు. ఆస్పత్రుల్లో ఐసీయూ, తదితర విభాగాలకు సంబంధించిన ముఖ్యమైన పరికరాలను ఏఎంసీ లో కాకుండా సీఎంసీలో తీసుకోవాలని మంత్రి సూచించారు.పారిశుధ్యం అంశంపై చర్చలో భాగంగా బ్లీచింగ్ పౌడర్ లో నాణ్యత ఉండాలని, స్థానికంగా కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఒకే చోట నుంచి నాణ్యత గా ఉన్న బ్లీచింగ్ పౌడర్ సరఫరా చేస్తే ప్రజల ఆరోగ్యం బాగుంటుందని మంత్రి తెలిపారు. విద్యపై చర్చలో భాగంగా ఉమ్మడి జిల్లాలో 20నుండి 25 సంవత్సరాలు దాటిన పాఠశాలల భవనాల స్థితిని తనిఖీ చేయించాలని మంత్రి ఉమ్మడి జిల్లాల డీఈఓ లను ఆదేశించారు. పాతపడిన భవనాల్లో పిల్లలకు ప్రమాదాలు జరుగకుండా ముందుగానే ఈ అంశంపై చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు.హంద్రీ నది మొదలు నుండి ఓల్డ్ టౌన్ చివర తుంగభద్రలో కలిసే వరకు సిల్ట్ బాగా పెరిగిపోయిందని, కొంచెం వరద వచ్చినా, సమీపంలో నివాసం ఉండే ఇళ్లల్లోకి నీరు వెళ్లే అవకాశం ఉందన్నారు.. ప్రతిపాదనలు సిద్ధం చేయమని చెప్పామని, చేశారా అని మంత్రి ఇరిగేషన్ ఎస్ఈ ని ఆరా తీశారు.. ప్రతిపాదనలు పంపామని ఎస్ఈ మంత్రి కి తెలుపగా, అందుకు సంబంధించిన ఒక కాపీ తనకు కూడా ఇవ్వాలని మంత్రి ఇరిగేషన్ ఎస్ఈని ఆదేశించారు.

## మాజీ ప్రధాని పీవీని స్మరించుకున్న చంద్రబాబు, లోకేష్




అమరావతి, (టుడే విదుర, జూన్ 28): మాజీ ప్రధాన మంత్రి పీవీ నరసింహారావు 104వ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ నివాళులర్పించారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. పీవీని స్మరించుకున్నారు. ఆయన తీసుకొచ్చిన ఆర్థిక సంస్కరణలను దేశ పరిస్థితిని మార్చేశాయని గుర్తు చేసుకున్నారు. బహుముఖ ప్రజ్ఞాశాలి మాజీ ప్రధాని అంటూ కొనియాడారు.చంద్రబాబు ట్వీట్ 'భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు గారి 104వ జయంతి సందర్భంగా ఘన నివాళి అర్పిస్తున్నాను. దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉండగా ప్రధాని బాధ్యతలు స్వీకరించి ఆర్థిక సంస్కరణల ద్వారా దేశగతిని మార్చిన పీవీ ఎప్పటికీ స్ఫూర్తిగానే నిలుస్తారు. ఆ మహనీయుడి స్మృతికి మరొక్క మారు నివాళి అర్పిస్తున్నాను' అంటూ సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు.

## స్మార్ట్ పోలీసింగ్‌తో నేరాలకు అడ్డుకట్ట: హోంమంత్రి అనిత



విజయవాడ: (టుడే విదుర, జూన్ 28): మహిళల రక్షణకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత ( పేర్కొన్నారు. నేడు శక్తి యాప్ ద్వారా మహిళలకు భద్రత, భరోసా ఇస్తున్నామని ఉద్ఘాటించారు. మొబైల్ మన చేతిలో ఉంటే.. ప్రపంచం మొత్తం మన చేతిలోనే ఉంటుందని సీఎం చంద్రబాబు చెబుతారని గుర్తుచేశారు. అదే మొబైల్‌ను మనకు రక్షణగా, అస్త్రంగా వినియోగించుకోవాలని సూచించారు. ఇవాళ(శనివారం) విజయవాడ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో సురక్ష 360 కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హోంమంత్రి అనిత పాల్గొని మాట్లాడారు.ఆపదలో ఉన్న వారు వాట్సాప్ నెంబర్‌కు ఒక్క మెసేజ్ చేస్తే పోలీసులు వెంటనే అప్రమత్తం అవుతారని హోంమంత్రి అనిత చెప్పుకొచ్చారు. సీసీ కెమెరాల ద్వారా ఏపీలో నేరాల సంఖ్య తగ్గిందని అన్నారు. ఎన్టీఆర్ జిల్లా కమిషనరేట్ టెక్నాలజీ వినియోగంలో ముందంజలో ఉందని ప్రశంసించారు. ఎక్కడ నేరం జరిగినా, ట్రాఫిక్ స్తంభించినా.. అసాంఘిక శక్తుల అడ్డాలను టెక్నాలజీ ద్వారా గుర్తించి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. అస్త్రం యాప్ ద్వారా ఎప్పటికప్పుడు ట్రాఫిక్ సమస్యలను పరిష్కరిస్తున్నారని చెప్పారు. నేడు పోలీసింగ్ అనేది ప్రజలకు చాలా చేరువ అవుతుందని తెలిపారు హోంమంత్రి అనిత.మోడల్ పోలీస్ స్టేషన్‌ను ఎన్టీఆర్ జిల్లా మొత్తం విస్తరించాలని హోంమంత్రి అనిత సూచించారు. సురక్ష యాప్, సురక్ష డివైస్ వల్ల ప్రజలకు ఎంతో మంచి జరుగుతోందని ఉద్ఘాటించారు. ఏపీలో ఇటీవల ఆన్‌లైన్ మోసాలు కూడా బాగా పెరిగాయని చెప్పారు. ప్రజలు కూడా అజ్ఞాత వ్యక్తుల నుంచి వచ్చే మెసేజ్‌లకు స్పందించవద్దని కోరారు. ఇలాంటి మోసాలను కూడా అరికట్టేందుకు టెక్నాలజీ ద్వారా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారని వెల్లడించారు. ప్రజల భద్రత కోసం ఏపీ పోలీస్‌శాఖ, తమ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని చెప్పారు.

## ఎఫ్‌సీఐ, సివిల్ సప్లై శాఖను మరింత పటిష్టం చేస్తాం: లావు శ్రీ కృష్ణదేవరాయలు



విజయవాడ:(టుడే విదుర, జూన్ 28): ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఏపీకి సంబంధించి సివిల్ సప్లైతో 2017 నుంచి కలిసి పని చేస్తోందని తెలుగుదేశం ఎంపీ, ఎఫ్‌సీఐ ఏపీ చైర్మన్ లావు శ్రీ కృష్ణదేవరాయలు వెల్లడించారు. (శనివారం) విజయవాడలో ఎఫ్‌సీఐ, సివిల్స్ సప్లై శాఖతో సంయుక్తంగా రాష్ట్రస్థాయి సంప్రదింపుల కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో లావు శ్రీ కృష్ణదేవరా యలు, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లావు శ్రీ కృష్ణదేవరాయలు మీడియాతో మాట్లాడారు. ఏపీలో ఎక్కువభాగం ప్రొక్యూర్‌మెంట్, డిస్ట్రిబ్యూషన్ సివిల్ సప్లై శాఖ చేస్తోందని తెలిపారు లావు శ్రీ కృష్ణదేవరాయలు. అదనంగా ఉన్న కోటాను మాత్రం ఎఫ్‌సీఐ తీసుకుని ఇతర ప్రాంతాలకు తరలిస్తోందని లావు శ్రీ కృష్ణదేవరాయలు పేర్కొన్నారు. నేడు ఈ సమావేశంలో జీఎం, ఇతర ఉన్నతాధికారులు వివిధ అంశాలపై చర్చించారని వెల్లడించారు. ఎఫ్‌సీఐ గోడౌన్‌కు వచ్చే బియ్యం క్వాలిటీని పెంచడంతో పాటు, స్టోరేజీ కెపాసిటీ ఇప్పుడు మరింత పెంచాలని నిర్ణయించామని తెలిపారు. ఎఫ్‌సీఐ గోడౌన్స్ ఖాళీగా ఉంటే వాటిని కూడా వినియోగించుకోవాలని చెప్పారని అన్నారు. ఏపీకి ఇచ్చిన వాటా ప్రకారం ప్రొక్యూర్ చేసేదంత, బయటకు ఎంత పంపాలి అనే అంశాలపై అంచనాలు రూపొందించారని వెల్లడించారు లావు శ్రీ కృష్ణదేవరాయలు.

# దీర్ఘకాలిక విద్యుత్తు కొనుగోళ్లకు నో



అమరావతి, (టుడే విదుర, జూన్ 28): నేషనల్ హైడ్రో పవర్ కంపెనీలకు చెందిన జల విద్యుత్కేంద్రాల నుంచి దీర్ఘకాలిక విద్యుత్తు కొనుగోళ్లకు అనుమతి కోరుతూ డిస్కమ్‌లు చేసిన ప్రతిపాదనలను ఏపీఈఆర్‌సీ తిరస్కరించింది. విద్యుదుత్పత్తి ప్రారంభం కానందున కొనుగోళ్లకు అనుమతిని ఇవ్వలేమని స్పష్టం చేసింది. హిమాలయాల సమీపంలో పంప్డ్ స్టోరేజీ, జల విద్యుత్కేంద్రాలు ఏర్పాటు చేయడంవల్ల అంతర్రాష్ట్ర ట్రాన్స్‌మిషన్ చార్జీలు వర్తిస్తాయని హెచ్చరించింది. ఈ మేరకు ఈఆర్‌సీ మెంబర్, చైర్మన్ పీవీఆర్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

# లుక్ తో లూటీ



**లుక్ యాప్‌తో ఆదాయం అంటూ ఎర**
**చైన్ లింక్ పద్ధతిలో కోట్లు కొల్లగొట్టిన సైబర్ నేరగాళ్లు**
**ఉమ్మడి అనంతపురంలో వేలాదిగా బాధితులు**

అనంతపురం(టుడే విదుర, జూన్ 28): 'లుక్' అంటూ.. ఓ యాప్ అందుబాటులోకి వచ్చింది. తాము పంపే లింక్‌ను ఓపెన్ చేసి కొన్ని సెకన్లపాటు చూస్తే.. ఒక్కో లింక్‌కు రూ.15 ఇస్తామంటూ ఆశ రేపింది. ఇలా వేలల్లో సంపాదించుకోవచ్చు.. ఆ సొమ్మును వారం వారం విత్‌డ్రా చేసుకోవచ్చు అంటూ నమ్మించింది. సెక్యూరిటీ డిపాజిట్ కడితే ప్రతి లెవెల్‌కూ మీ ఆదాయం భారీగా పెరుగుతుందని ఎర వేసింది. అంతే.. దేశవ్యాప్తంగా 30 లక్షల మంది అందులో చేరిపోయారు. భారీగా సొమ్ములు జమ చేశారు. అందరికీ నమ్మకం కుదిరాక.. యాప్ నిర్వాహకులు అందరి చెవుల్లోనూ పూలు పెట్టారు. ఇప్పటికే వసూలు చేసిన కోట్లాది రూపాయలతో మాయమయ్యారు. నిర్వాహకులు ఎవరో తెలీక బాధితులు లబోదిబోమంటున్నారు. లుక్ యాప్ మార్కెట్‌లోకి వచ్చిన కొత్తలో మొదటి నాలుగు రోజులు ఫ్రీగా ఎంట్రీ కల్పించారు. రోజుకు రూ.200 ఆదాయం చూపించారు. ఆ తర్వాత యాప్‌లో కొనసాగాలంటే సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాలని షరతు పెట్టారు. లెవెల్ పెరిగే కొద్దీ ఆదాయం పెరుగుతుందని చెప్పారు. ఆ సొమ్మును యాప్ వ్యాలెట్ నుంచి తమ బ్యాంకు ఖాతాలకు మళ్లించుకునే వెసులుబాటు కల్పించారు. ఈ నెల 25లోగా చేరేవారికి సెక్యూరిటీ డిపాజిట్ తిరిగి ఇచ్చేస్తామని, చేర్పించే వారికి టీవీలు, ఫ్రిజ్‌లు, ఏసీలు, కార్లు.. చివరకు రూ.50 లక్షల విలువ చేసే ఇళ్లను కానుకగా ఇస్తామన్నారు. దీంతో చాలామంది ఎగబడ్డారు.

# క్షయ నిరోధానికి అందరూ కృషి చేయాలి

మద్దిపాడు,(టుడే విదుర, జూన్ 28): క్షయ వ్యాధిని నిరోధించటానికి కేంద్ర ప్రభుత్వం టీబీ ముక్త్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తు న్నదని జిల్లా టీబీ యూనిట్ అధికారి డాక్టర్ శ్రీవాణి పేర్కొన్నారు. మండలంలో ని ఘడియపూడి, గార్లపాడు గ్రామాల్లో టీబీ ముక్త్ భారత్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభిం చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 60 సం వత్సరాలు దాటిన వ్యక్తులకు దుర్వసనాలు, పౌష్టికాహార లోపం వల్ల టీబీ వస్తుందన్నారు. వారం రోజులపాటు దగ్గుతో బాధపడే వారిని గుర్తించి వారికి కళ్లె పరీక్షలు చేయించాలని సి బ్బందికి సూచించారు. మొబైల్ ఎక్స్‌రే యూని ట్‌ను గ్రామానికి తీసుకువచ్చి వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ ఆనంద్‌మోహన్ మా ట్లాడుతూ ఏఎన్‌ఎంలు ఇంటింటికి తిరిగి టీబీ నమూనాలు తీసుకుంటారని, ప్రజలు సహక రించాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజ ర్ చంద్రమౌళి, డాక్టర్ అన్వేష్, లలితమ్మ, రజి తకుమారి, బాలకోటయ్య, నాగరాజు, సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# జుత్తాడ హత్యల కేసులో ముద్దాయికి ఉరి

**పాత కక్షలతో 2021లో ఒకే కుటుంబంలో ఆరుగురి హత్య**
**నాలుగేళ్ల విచారణ తర్వాత తుది తీర్పు**





పెందుర్తి, (టుడే విదుర, జూన్ 28): : విశాఖ జిల్లా పెందుర్తి మండలం జుత్తాడలో అత్యంత కిరాతకంగా ఆరుగురిని హత్య చేసిన ముద్దాయికి ఉరి శిక్ష విధిస్తూ విశాఖపట్నం నాలుగో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి ఎం.నాగేశ్వరరావు తీర్పు చెప్పారు. నాలుగేళ్ల కిందట జరిగిన ఈ ఘటనలో 91 మంది సాక్షులను విచారించిన అనంతరం, నిందితుడిపై నేరం రుజువు కావడంతో తీర్పు వెలువరించారు. కేసు గురించి ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఖజానారావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెందుర్తి మండలం వాలిమెరక జుత్తాడలో 2021 ఏప్రిల్ 15న బత్తిన అప్పలరాజు (49) అదే గ్రామానికి చెందిన బమ్మిడి విజయ్‌కుమార్ కుటుంబంలోని ఆరుగురిని అత్యంత కిరాతకంగా కత్తితో పొడిచి హత్య చేశాడు. మృతుల్లో విజయ్‌కుమార్ భార్య ఉషారాణి (35), కుమార్తె ఉర్విష లిఖిత (ఆరు నెలలు), కుమారుడు ఉదయ్‌నందన్ (2), తండ్రి బమ్మిడి రమణ (63), మేనత్త నెక్కల అరుణ (57), అత్త రమాదేవి (62) ఉన్నారు. అనంతరం అప్పలరాజు డయల్ 100కు ఫోన్ చేసి, పోలీసులకు లొంగిపోయాడు. కొన్నేళ్ల క్రితం అప్పలరాజు ఇంటి సమీపంలోనే విజయ్‌కుమార్ కుటుంబం నివాసం ఉండేది. ఆ సమయంలో అప్పలరాజు కుమార్తె పట్ల విజయ్‌కుమార్ అసభ్యంగా ప్రవర్తించాడనే కారణంలో ఇరు కుటుంబాల మధ్య ఘర్షణలు జరిగాయి. తర్వాత ఉపాధి రీత్యా విజయ్‌కుమార్ కుటుంబం విజయవాడ వెళ్లిపోయింది. ఒకరోజు విజయ్‌కుమార్ మినహా మిగిలిన కుటుంబసభ్యులు స్వగ్రామం జుత్తాడ వచ్చారు. అప్పటికే పగతో రగలిపోతున్న అప్పలరాజుకు ఈ విషయం తెలియడంతో 2021 ఏప్రిల్ 15వ తేదీ తెల్లవారుజామున ఇంటి ముందు కల్లాపు జల్లుతున్న విజయ్‌కుమార్ భార్యపై కత్తితో దాడి చేశాడు. %అనంతరం ఇంట్లోకి ప్రవేశించి, నిద్రిస్తున్న విజయకుమార్ తండ్రి, అత్త, మేనత్తలను నరికేశాడు. ఉలిక్కిపడి లేచి ఏడుస్తున్న ఆరునెలల పసిపాప, రెండేళ్ల బాబును కూడా చంపేశాడు. అనంతరం బయటికి వచ్చి స్థానికులను కత్తితో బెదిరించి పోలీసులకు తానే ఫోన్ చేసి లొంగిపోయాడు. విచారణలో ముద్దాయి అప్పలరాజులో ఎలాంటి పశ్చాత్తాపం కనిపించలేదని అప్పటి సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. నాలుగేళ్ల విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో ముద్దాయి అప్పలరాజుకు న్యాయస్థానం ఉరి శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది.

# రుచిగా.. శుచిగా...

♦ దొనకొండ పాఠశాలలో మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థులు
♦ ప్రభుత్వ పాఠశాలల్లో సన్నబియ్యంతో నాణ్యమైన మధ్యాహ్న భోజనం
♦ %ఇష్టంగా తింటున్న విద్యార్థులు
♦ హర్షం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు



దొనకొండ, (టుడే విదుర, జూన్ 28): : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు రుచికరమైన పౌష్టికాహారం అందించాలని టీడీపీ కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పాఠశాలలు పునఃప్రారంభం నాటికి అన్ని పాఠశాలలకు సన్నబియ్యాన్ని అధికారులు సరఫరా చేశారు. ఈ బియ్యం పక్కదారి పట్టకుండా ప్రతి బస్తాకు క్యూఆర్ కోడ్‌తో ట్యాగ్‌ను ఏర్పాటు చేసి 25 కేజీల బస్తాను పాఠశాలలకు సరఫరా చేశారు. మండలంలోని 18 గ్రామ పంచాయతీ పరిధిలో 69 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో ప్రస్తుతం 4,227 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పాఠశాలలు పునఃప్రారంభం నుంచి మధ్యాహ్న భోజనం సన్నబియ్యంతో తయారు చేయించి విద్యార్థులకు అందజేస్తున్నారు. విద్యార్థులు రుచికరంగా ఉ ందంటూ తృప్తిగా భోజనం చేస్తున్నారు. ఇంటి భోజనం లాగే ఉందని విద్యార్థులు ఆనందపడుతున్నారు. గతంలో లావు బియ్యంతో నిర్వహించే మధ్యాహ్న భోజనం తినలేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీంతో కొంతమంది ఇళ్లకు వెళ్లి తినిరావటం, మరికొందరు క్యారేజీలు తెచ్చుకొని తినేవారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సన్నబియ్యంతో నాణ్యమైన మధ్యాహ్న భోజనం విద్యార్థులకు అందిస్తుండటంపై తల్లిదండ్రులు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రజాప్రభుత్వానికి ఆశీస్సులు అందించండి

**శంకుస్థాపన చేస్తున్న మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియా**
**మంత్రి డాక్టర్ వీరాంజనేయస్వామి**
**%సింగరాయకొండలో రూ.61 లక్షలతో నిర్మిస్తున్న అన్నా క్యాంటీన్‌కు కలెక్టర్‌తో కలిసి భూమిపూజ**
**త్వరలో ఈనాం భూముల సమస్యకు పరిష్కారం**



సింగరాయకొండ, (టుడే విదుర, జూన్ 28): రాష్ట్రంలో అభివృద్ధిని, సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్న ప్రజాప్రభుత్వానికి ప్రజలు ఆశీస్సులు ఇవ్వాలని మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి చెప్పారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాల ఎదురు రూ.61 లక్షలతో నిర్మిస్తున్న అన్నా క్యాంటీన్‌కు కలెక్టర్ తమీమ్ అన్సారియాతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018లో కందుకూరు రోడ్డు సెంటర్‌లో అన్నాక్యాంటీన్ నిర్మాణాన్ని ప్రారంభించగా, ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం దాని నిర్మాణాన్ని అర్ధంతరంగా నిలిపేసిందని తెలిపారు. ప్రస్తుతం అన్నాక్యాంటీన్ల డిజైన్ మారినందున ఆస్థలం సరిపోకపోవడంతో మార్చామన్నారు. కార్మికులు, పేదలు అధికంగా ఉండే ఇక్కడే తొలిప్రాధాన్యతగా క్యాంటీన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. క్యాంటీన్‌లో రూ.5 ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం పెడతారన్నారు. గుంతలమయంగా ఉన్న ట్రంకురోడ్డు నిర్మాణానికి మార్చి తరువాత బడ్జెట్‌లో నిధులు తీసుకొచ్చి పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. మండల ప్రజల ఎదుర్కొంటున్న ఈనాం భూముల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం మంత్రుల ఉ పసంఘం కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. మూలగుంటపాడు భూముల రిజిస్ట్రేషన్ సమస్యను కూడా త్వరలో పరిష్కరిస్తామని హామీఇచ్చారు. కలెక్టర్ అన్సారియా మాట్లాడుతూ మూడు నెలలలోపు అన్నా క్యాంటీన్ నిర్మాణం పూర్తవుతుందన్నారు. అనంతరం ఎస్సీ బాలుర వసతిగృహం ఆధునికీకరణ పనులను వారు పరిశీలించారు. అనంతరం వాడుకలో లేని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ పరిశీలనకు వెళ్లగా తాళాలు వేసి ఉండటంతో వినియోగంలోకి తీసుకొచ్చేలా ఆదేశాలు ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు. తదనంతరం నిర్మాణంలో ఉన్న కూరగాయల మార్కెట్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో లక్ష్మీప్రసన్న, పబ్లిక్ హెల్త్ ఈఈ శ్రీనివాస సంజయ్, సాంఘిక సంక్షేమశాఖ డీడీ లక్ష్మానాయక్, ఎంపీడీవో జయమణి, టీడీపీ మండల అధ్యక్షుడు సింగయ్య, నేతలు చీమకుర్తి కృష్ణ, సంధానీబాషా, సన్నెబోయిన శ్రీనివాసులు, కూనపరెడ్డి సుబ్బారావు, సుదర్శి చంటి, గాలి హరిబాబు, బ్రహ్మయ్య, గిరి, గుదే వెంకటేశ్వర్లు, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# గొర్రెలు, మేకలకు నట్టల నివారణ వ్యాక్సిన్



లఆత్రేయపురం, (టుడే విదుర, జూన్ 28): జిల్లాలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ వ్యాక్సిన్ అందించే కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి కె.వెంకట్రావు పేర్కొన్నారు. ర్యాలిలో గొర్రెలు, మేకలకు వ్యాక్సిన్ అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రభుత్వం వర్షాకాలంలో గొర్రెలు, మేకలకు వ్యాధులు ప్రబలకుండా నివారణ చర్యలు చేపట్టిందన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఈ నెల 26 నుంచి వచ్చే 10వ తేదీ వరకూ 15 రోజులపాటు దీన్ని నిర్వహిస్తున్నామన్నారు. ర్యాలి గ్రామంలో 250 గొర్రెలు, మేకలను గుర్తించి నట్టల నివారణ వ్యాక్సిన్ అందిస్తున్నామన్నారు. పశువుల ఆసుపత్రిలో మందుల సైతం సిద్ధంగా ఉన్నాయన్నారు.

# ఏరోస్పేస్ డిఫెన్స్ పరిశ్రమల హబ్‌గా ఏపీ

## లక్ష కోట్ల పెట్టుబడి లక్ష ఉద్యోగాలే లక్ష్యం
## ఉత్తర్వుల్లో పరిశ్రమల శాఖ వెల్లడి



అమరావతి,(టుడే విదుర, జూన్ 28): ఏరోస్పేస్-డిఫెన్స్ రంగంలో విస్తృత అవకాశాలను అందిపుచ్చుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేసింది. రాష్ట్రా న్ని గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ అండ్ డిఫెన్స్ రిసెర్చ్ హబ్‌గా మార్చాలన్న నిర్ణయంతో ఈ రంగంలో విదేశీ పెట్టుబడులకు ఆహ్వానం పలుకుతూ ఏరోస్పేస్-డిఫెన్స్ పాలసీ 2025-30ని విడుదల చేసింది. రూ. లక్ష కోట్లు పెట్టుబడుల సేకరణ.. లక్ష మందికి ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పెట్టుకున్నట్లు స్పష్టం చేసింది. ఈ రంగంలో పెట్టే పెట్టుబడులపై 25 నుంచి 45 శాతం వరకూ రాయితీ ఇవ్వాలని, సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల జీతాల్లో నూ 10 శాతం భరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వివిధ విభాగాల్లో ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు రాష్ట్రాన్ని ఆరు క్లస్టర్లుగా విభజించింది. ఈ మేరకు రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏరోస్పేస్-డిఫెన్స్ పాలసీని అమలు చేయడం ద్వారా రాష్ట్రాన్ని గ్లోబల్ మా న్యుఫ్యాక్చరింగ్ అండ్ డిఫెన్స్ రిసెర్చ్ హబ్‌గా మార్చాలన్న లక్ష్యంతో ఉన్నామ ని పరిశ్రమల శాఖ పేర్కొంది. సింగిల్ విండో వి?ధానంలో పెట్టుబడులకు క్లియరెన్సులను ఇస్తామని వెల్లడించింది. డిఫెన్స్ రంగంలో కొత్త ఆవిష్కరణలకు ఆంధ్రప్రదేశ్ గ్లోబల్ వేదికగా మార్చేందుకు ఈ పాలసీ దోహదపడుతుందని ధీమా వ్యక్తం చేసింది.

# గ్రీన్ ఫీల్డ్ హైవే నుంచి పొలాలకు దారివ్వాలి



## పుట్లగట్లగూడెం వద్ద గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే సర్వీసు రోడ్డు వద్ద రాస్తారోకో

జంగారెడ్డిగూడెం,(టుడే విదుర, జూన్ 28): మండలంలోని పుట్లగట్లగూడెం వద్ద గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే పనులను రైతులు అడ్డుకున్నారు. రహదారిపై టెంట్ వేసి రాస్తారోకో నిర్వహించారు. హైవే రోడ్డు పనులు పూర్తయిన తర్వాత పొలాలకు వెళ్లే రహదారి నిర్మించి ఇస్తామని చెప్పిన అ?ధికా రులు ఇప్పుడు దారి మూసివేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రైతులు దుక్కి దున్ని వరినాట్లు వేసే సమయం కావడంతో పొలాల్లోకి వెళ్లడా నికి దారిలేక ఇబ్బందులు పడుతున్నట్లు మాజీ జడ్పీటీసీ, రైతు శీలం రామ చంద్రరావు, వైసీపీ మండల అధ్యక్షుడు, రైతు వామిశెట్టి హరిబాబు తెలిపారు. గత మూడేళ్లుగా జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులకు వినతులు సమర్పిస్తున్నా పట్టించుకోవడంలేదని వాపోయారు. వరద నీరు, కొంగలచెరువు నుంచి వచ్చే వరద నీరు వెళ్లే దారి కూడా మూసివేయడంతో పంటలను ముంచి వేస్తున్నాయని రైతులు తెలిపారు. ఎంపీ పుట్టా మహేశ్, చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ స్పందించి తమకు న్యాయం చేయాలని రైతులు కోరారు. రైతుల రాస్తారోకో కారణంగా వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికు లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కార్యక్రమంలో రైతులు గొల్లపూడి శ్రీనివాసరావు, శీలం వెంకటరాజు, బొచ్చు శ్రీను, పళ్ల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# భక్తులు దానం చేసిన గోవులు అమ్మకానికి..

- ఆలనాపాలనా లేక పొల్లాల్లో ఉన్న గోవులు
- సంరక్షకుడి ముసుగులో చదలవాడ సర్పంచ్ అకృత్యాలు
- %అడ్డుకున్న దేవస్థానం ఈవో, టీడీపీ నేత, గ్రామస్థులు
- ప్రస్తుతం గోమాతలకు ఆంజనేయుడే దిక్కు...



నాగులుప్పలపాడు, (టుడే విదుర, జూన్ 28): : దేశంలో గోమాతలను పూజించే సంస్కృతి మనది.. అవి అంటే ఎనలేని భక్తిభావం ఇమిడి ఉంది.. అలాంటి గోవులకు ఎలాంటి ఇబ్బంది కలిగినా తమకు తోచిన రీతిలో కాపాడుతుంటారు. అలాంటిది, కాషాయం ధరించిన వ్యక్తి సాక్షాత్తు గ్రామ ప్రథమ పౌరుడైన సర్పంచ్ వాటిని అమ్మకానికి పెట్టి సొమ్ము చేసుకోవాలని ప్రయత్నించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నాగులుప్పలపాడు మండలం చదలవాడలో జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకెళితే... నిత్యం కాషాయి వస్త్రాలు ధరించి ఉండే చదలవాడ గ్రామ పంచాయతీ సర్పంచ్ దానరి వరప్రసాదరావు కొన్నేళ్ల క్రితం చీర్వానుప్పలపాడురోడ్డులోని శ్రీఆంజనేయస్వామి దేవస్థానం వద్ద మఠంలో వృద్ధాశ్రమం నడుపుతుండేవాడు. అప్పట్లో దేవస్థానానికి పలువురు భక్తులు, దాతలు గోవులను దానంగా ఇచ్చారు. వాటి సంరక్షణకు అవసరమైన గడ్డి, తవుడు ఇతరత్రావి కూడా దాతలే సమకూర్చుకొంటూ వస్తున్నారు. గోవుల సంరక్షణకు భక్తుల సహకారంతో షెడ్లను కూడా నిర్మించారు. కొద్ది రోజుల క్రితం వృద్ధాశ్రమం మూతపడింది. మొత్తం 22 గోవులున్నాయి. ఇటీవల వాటిని చిలకలూరిపేటకు చెందిన కొందరు వ్యక్తులకు సర్పంచ్ అమ్మకానికి పెట్టారు. వాటిని లారీలలో ఎక్కించి తరలించే ప్రయత్నం చేస్తుండగా దేవస్థాన ఈవో అనిల్‌కుమార్, గ్రామ టీడీపీ నాయకులు బోయిడి బ్రహ్మరాజు, పలువురు గ్రామస్థులు అడ్డుకోవడంతో వ్యాపారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. దేవస్థానానికి దాతలు ఇచ్చిన గోవులను అమ్ముకోవడం మంచి పద్ధతి కాదని సర్పంచ్‌ను ఈవో అనిల్ హెచ్చరించారు. దీంతో సర్పంచ్ గోవుల సంరక్షణ బాధ్యత తాను తీసుకోనని, వాటి కోసం నిర్మించిన షెడ్లలోని ఫ్యాన్లు, ఇతర సామన్లను తొలగించారు. ఇన్నాళ్లు గోవుల సంరక్షణ చూసింది తానేనని, వాటిపై హక్కు తనకే ఉందని తనను అమ్ముకోనివ్వకుండా అడ్డుకొంటున్నారని రెండు రోజుల అనంతరం ఈవోపై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు కూడా వెనకాడలేదు. ఆ విషయం ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ పరిధిలో తేల్చుకోవాలని పోలీసులు సలహా ఇవ్వడంతో గోవుల ఆలనాపాలనాను వదిలేశారు. వాటి దుస్థితికి చలించిన గ్రామానికి చెందిన ఓ రైతు వాటి సంరక్షణను చూస్తున్నారు. దాంతో సర్పంచ్ తీరుపై గ్రామస్థులు మండిపడుతున్నారు.

# కోకో గింజలు కొనుగోలు చేయాలి

## విజయరాయిలో ఆందోళన చేస్తున్న కోకో రైతులు




పెదవేగి, (టుడే విదుర, జూన్ 28): రైతుల దగ్గర నిల్వ ఉన్న కోకో గింజలను పూర్తిగా కొనుగోలు చేసి, రైతులను ఆదుకోవాలని కోకో రైతు సంఘం విజ్ఞప్తి చేసింది. అంతర్జాతీయ మార్కెట్ ధరలకు అనుగుణంగా కోకో గింజలకు ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. విజయరాయిలో కోకో రైతులు సమావేశమై కోకో గింజల కొనుగోలుపై నిరసన వ్యక్తంచేశారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కోకో గింజల కొనుగోలు కంపెనీలు రైతుల దగ్గర నుంచి గింజలను పూర్తిస్థాయిలో కొనుగోలు చేయకుండా ఇబ్బం దులకు గురి చేస్తున్నాయన్నారు. రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తులు తీసు కోవడంలేదని, వచ్చేనెల 15 వరకు ప్రభుత్వం అందిస్తున్న రూ.50 ప్రోత్సాహ కంతో కిలో రూ.500 చెల్లించి కొనుగోలు చేసేలా ఆయా సంస్థలకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అనంతరం పెదవేగి పామాయిల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆయిల్‌పామ్ రైతులు చేస్తున్న పోరాటానికి కోకో రైతు సంఘం తరపున సంఘీ భావం తెలిపారు. పామాయిల్ ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ ఆలోచనను విరమిం చుకోవాలని సంఘం విజ్ఞప్తి చేసింది. కోకో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొల్లు రామకృష్ణ, విజయరాయి ప్రాంతీయ కొబ్బరి రైతుల సంఘం నాయకుడు పాలడుగు నరసింహారావు, రైతులు గుదిబండి వీరారెడ్డి, కోనేరు సతీష్‌బాబు, రాపర్ల తేజకృష్ణ, ఆలపాటి వాసు, వై.శ్రీనివాసరావు, బొప్పన మునీశ్వరరావు, బింగి శ్రీను, పావులూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# బదిలీ వార్




మచిలీపట్నం(టుడే విదుర, జూన్ 28): జడ్పీ చైర్‌పర్సన్, సీఈవో విభేదాల నడుమ ఈనెల 9న 104 మంది ఉద్యోగుల బదిలీలు జరిగాయి. వీరిలో ఎంపీడీవోలు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, ఇతర విభాగాల ఉద్యోగులు ఉన్నారు. బదిలీలు జరిగినా, వారిలో చాలామంది ఇంతవరకు రిలీవ్ కాలేదు. కౌన్సెలింగ్‌కు ముందే కొంతమంది ఉద్యోగులకు పదోన్నతి ఇచ్చి కీలక ప్రాంతాలకు బదిలీ చేయటం కూడా వివాదాస్పదంగా మారింది. బజిల్లా పరిషత యాజమాన్యంలో పనిచేసే ఉద్యోగులకు ఈ నెల 9న బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. బదిలీ కోరుకున్న ఉద్యోగులు.. ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలు తెచ్చుకున్నారు. శాసనసభ్యులు కొంతమంది ఉద్యోగులను తమ నియోజకవర్గంలో వద్దని కూడా లేఖలు ఇచ్చారు. వీటిలో మండల పరిషతలలో పనిచేసే ఎంపీడీవోలు, ఏవోలు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు ఉన్నారు. ప్రజాప్రతినిధులు వద్దని సిఫార్సు చేసిన ఉద్యోగులను వేరే నియోజకవర్గాలకు బదిలీ చేసి, ఖాళీ అయిన స్థానాల్లో ప్రజాప్రతినిధులు సిఫార్సు చేసిన వారిని నియమించలేదు. జడ్పీ అధికారుల చిత్తానుసారం వేరే ఉద్యోగులను మండలాలకు బదిలీ చేశారు. దీంతో ఈ బదిలీల జాబితాను పరిశీలించిన ఎమ్మెల్యేలు, మంత్రులు తాము సూచించిన వారిని కాకుండా వేరే ఉద్యోగులను బదిలీ చేయటంతో అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. దీంతో బదిలీ అయిన ఉద్యోగులు వారికి కేటాయించిన మండలాల్లో చేరేందుకు అవకాశం లేకుండాపోయింది. 18 రోజులుగా ఉద్యోగులు తాము ఎక్కడ విధులు నిర్వహించాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు.ఇష్టానుసారంగా బదిలీలు చేస్తే ఉత్తర్వులపై సంతకం పెట్టేది లేదని కౌన్సెలింగ్ జరిగే సమయంలోనే చైర్‌పర్సన్ ఉప్పాల హారిక చెప్పారు. అయినప్పటికీ జడ్పీ సీఈవో బదిలీల ప్రక్రియ నిర్వహించారు. ఈ బదిలీల అనంతరం పంచాయతీరాజ్ విభాగ కమిషనర్ ఆగిరిపల్లి మండలం పర్యటనకు రాగా, అక్కడకు వెళ్లిన జడ్పీ సీఈవో అన్ని విషయాలను ఆయనకు వివరించారు. చైర్‌పర్సన్ సంతకం లేకున్నా.. ఆ ఫైలును తనకు పంపాలని కమిషనర్ చెప్పినట్లు ఉద్యోగులు గుసగుసలాడుకుంటున్నారు.ఇసుకకు సంబంధించిన వివరాలు సక్రమంగా చూపకపోవడం, ఇతరత్రా ఆరోపణలపై కంచికచర్ల మండల పరిషత కార్యాలయంలో పనిచేస్తున్న ఏవోను గతంలో సస్పెండ్ చేశారు. చాట్రాయి మండల పరిషత కార్యాలయంలో ఏవోగా పనిచేసే అధికారి ఒక్కరోజు ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఉండి మండల పరిషత నిధులు రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షలు డ్రా చేశాడు. ఈ విషయం వెలుగులోకి రావడంతో విచారణ చేసి అతడ్ని కూడా సస్పెండ్ చేశారు. ఈ ఇద్దరు ఏవోలకు ఇటీవల వేరే మండలాల్లో పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులిచ్చారు. ఈ బదిలీలను చైర్‌పర్సన్ దృష్టికి తీసుకురాకుండానే నిర్వహించారు. తన దృష్టికి రాకుండా బదిలీ ఎలా చేశారని ఆమె ఫైల్‌పై సంతకం చేయలేదు. ఈ ఇద్దరు ఏవోలకు పోస్టింగ్‌లు ఇచ్చే విషయంలో నగదు చేతులు మారిందనే ఆరోపణలు వస్తున్నాయి. ఎవరెవరికి ఎంత నగదు ఇచ్చారో లిఖితపూర్వకంగా రాసిస్తే, విచారణ అనంతరం సంతకం పెడతానని చైర్‌పర్సన్ చెబుతున్నారు. అలాగే, కలిదిండి, రెడ్డిగూడెం మండలాల్లో ఖాళీలున్నా ఉ

# సైనేడ్‌తో హత్యలు..
## విజయవాడ కోర్టు సంచలన తీర్పు



విజయవాడ:(టుడే విదుర, జూన్ 28): సైనేడ్ ఉపయోగించి పది హత్యలు చేసిన నిందితులకు జీవిత కారాగార శిక్ష, జరిమానాలను విజయవాడ న్యాయస్థానం విధించింది. 2019వ సంవత్సరంలో ఏలూరులో కాటి నాగరాజు అనుమానాస్పద మృతిపై 174 సీఆర్‌పీసీ కేసు నమోదైంది. అప్పటి ఏలూరు డీఎస్పీ దిలీప్ కిరణ్, ఏలూరు రూరల్ సీఐ అనుసూరి శ్రీనివాసరావులు ఈ కేసు దర్యాప్తు జరిపారు. నాగరాజుని సైనేడ్ ఉపయోగించి హత్య చేశారని పోలీసులు గుర్తించారు. ఈ కేసులో ఏలూరుకు చెందిన వెల్లంకి సింహాద్రిని, విజయవాడకు చెందిన షేక్ అమీనుల్లా బాబులను పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. విజయవాడ అజిత్‌సింగ్ నగర్‌లో భాస్కర్‌ని కూడా సైనేడ్ ఇచ్చి చంపినట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ విచారణలో మరో ఏడుగురిని కూడా సైనేడ్ ఇచ్చి హతమార్చినట్లు పోలీసుల విచారణలో తేలింది. నిందితులు వెల్లంకి సింహాద్రి, షేక్ అమీనుల్లా బాబుపై నేరం రుజువు కావడంతో నిందితులకు జీవిత ఖైదుతో పాటు, ఒకొక్కరికి రూ. 25 వేలు జరిమానాను ఏడో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి బందెల అబ్రహం విధించారు.

# చొక్కాపట్టి.. చెంపపై కొట్టి..
# మహిళా కండక్టర్ దౌర్జన్యం




కృష్ణా జిల్లా,(టుడే విదుర, జూన్ 28): ఓ వృద్ధ ప్రయాణికుడి పట్ల మహిళా కండక్టర్ ప్రవర్తించిన తీరు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సాధారణంగా బస్సుల్లో కండక్టర్లతో కొందరు ప్రయాణికులు గొడవపడుతుంటారు. అలాగే ప్రయాణికులతో కూడా పలువురు కండక్టర్‌లు దురుసుగా ప్రవర్తింటారు. ప్రధానంగా బస్సుల్లో టికెట్ తీసుకునే సమయంలో చిల్లర విషయంలోనే తరచూ కండక్టర్, ప్రయాణికుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంటుంది. కానీ.. ఓ మహిళ కండక్టర్ మాత్రం వృద్ధుడి పట్ల రెచ్చిపోయి ప్రవర్తించింది. పెద్దాయన అని కూడా చూడా అతని పట్ల ఆమె ప్రవర్తించిన తీరు ఇప్పుడు సంచలనంగా మారింది. కృష్ణా జిల్లా పామర్రులో వృద్ధ ప్రయాణికుడిపై ఆర్టీసీ బస్సు మహిళా కండక్టర్ వీరంగం సృష్టించింది. టికెట్ విషయంలో జరిగిన వివాదంలో వృద్ధుడి చొక్కా పట్టుకొని చెంపపై కొట్టింది ఉయ్యూరు డిపో మహిళా కండక్టర్. తోట్లవల్లూరు నుంచి ఉయ్యూరు వెళుతున్న బస్సులో ఈ ఘటన జరిగింది. ఉయ్యూరు వెళ్లేందుకు పెద్దిబోయిన మల్లికార్జునరావు అనే వృద్ధుడు అంబేద్కర్ బొమ్మ సెంటర్లో బస్సు ఎక్కాడు. తాను ఎక్కడకు వెళ్లాలో చెప్పి కండక్టర్‌ను టికెట్ అడిగాడు. ఇందుకు గాను కండక్టర్‌కు రెండువందల నోటు ఇచ్చాడు. అయితే తన దగ్గర చిల్లర లేదని.. చిల్లర ఇవ్వాలని కండక్టర్ అడిగింది. తన దగ్గర కూడా చిల్లర లేదని వృద్ధుడు చెప్పాడు. ఈ విషయంపై ఇరువురి మధ్య గొడవ చోటు చేసుకుంది. అది కాస్తా తారాస్థాయికి చేరడంతో కండక్టర్ ఆగ్రహంతో ఊగిపోయింది. చివరకు వృద్ధుడు మల్లికార్జునరావు చొక్కాపట్టుకుని మరీ కనకదుర్గ కాలనీ వద్ద దింపింది. అంతటితో ఆగకుండా వృద్ధుడి చెంపపై కొడుతూ దుర్భాషలాడింది . కండక్టర్ వీరంగం మొత్తాన్ని అక్కడే ఉన్న కొందరు వ్యక్తులు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దీంతో ఇరువురు మధ్య గొడవ వీడియోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. అయితే మహిళా కండక్టర్ ప్రవర్తనపై గతంలోనూ అనేక ఫిర్యాదులు చేశామని స్థానికులు చెబుతున్నారు. కాగా.. ఈ వివాదంపై తోట్లవల్లూరు పోలీసులకు మాత్రం ఎలాంటి ఫిర్యాదులు అందలేదు. వృద్ధుడి పట్ల మహిళా కండక్టర్ వ్యవహరించిన తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి

# ఏపీకి జాతీయ ఎమ్ఎస్ఎమ్ఈ ఇంపాక్ట్ అవార్డు




అమరావతి,(టుడే విదుర, జూన్ 28): : ఆంధ్రప్రదేశ్‌కు ప్రతిష్ఠాత్మక జాతీయ ఎమ్ఎస్ఎమ్ఈ ఇంపాక్ట్ అవార్డు లభించింది. అంతర్జాతీయ ఎంఎసఎంఈ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇండియా ఎస్ఎంఈ ఫోరం ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని లలిత్ హోటల్‌లో 'నేషనల్ ఎమ్ఎస్ఎమ్ఈ ఇంపాక్ట్ అవార్డ్స్–2025' పేరుతో వీటిని ప్రదానం చేశారు. ఎమ్ఎస్ఎమ్ఈ రంగంలో ఉత్తమ రాష్ట్రాల విభాగంలో మన రాష్ట్రం రజత పురస్కారాన్ని గెలుచుకుంది. రాష్ట్రం తరపున పరిశ్రమల శాఖ కమిషనర్ ఎం.అభిషిక్త్ కిశోర్..ఎమ్ఎస్ఎమ్ఈ మాజీ కేంద్రమంత్రి కల్‌రాజ్ మిశ్రా చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గనిర్దేశకత్వం, ప్రోత్సాహంతోనే రాష్ట్రానికి జాతీయ ఎమ్ఎస్ఎమ్ఈ ఇంపాక్ట్ అవార్డును సాధించగలిగామని రాష్ట్ర ఎమ్ఎస్ఎమ్ఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. భవిష్యత్తులో మరింత రెట్టించిన ఉత్సాహంతో పనిచేసి.. ఇంతకన్నా మంచి ఫలితాలు సాధించి, అత్యుత్తమ పతకాలు అందుకుంటామని ఆయన చెప్పారు.

# సగిలేరు గురుకులం తరలింపును వెంటనే ఆపాలి

సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల
పాఠశాలను తరలించేందుకు ఒప్పుకోం : విద్యార్థుల తల్లిదండ్రులు



బి.కోడూరు,(టుడే విదుర, జూన్ 28): సగిలేరు వద్ద ఉన్న సాం ఘిక సంక్షేమ గురుకుల పాఠశాల తరలింపును వెంటనే ఆపాలని వి ద్యార్థుల తల్లిదండ్రులతోపాటు స్థానిక ప్రజలు ప్రభుత్వాన్ని కోరు తున్నారు. 1992 నుంచి నడుస్తున్న సగిలేరు గురుకుల పాఠశాలలో ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకు తరగతులు నడుస్తున్నాయని. ఇందులో దాదాపుగా 300 మంది విద్యార్థులు విద్యన భ్యసిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని విద్యార్థులకు వస తులు కల్పించడంతోపాటు బద్వేలు నియోజకవర్గంలోని అట్లూరు, గోపవరం, బి.కోడూ రు. పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన మండలాలకు చెందిన విద్యార్థులు విద్యన భ్యసించేందుకు తోడ్పడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. కాగా బద్వేలు నియోజకవ ర్గంలో సగిలేరు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఒకే ఒక్కటి. ఆ పాఠశాలను తరలిస్తే సహించేదిలేదని ప్రజలంటున్నారు.

ఇనచార్జి మినిస్టరు, కలెక్టర్‌తో మాట్లాడా: రితేష్‌కుమార్‌రెడ్డి

సగిలేరు గురుకుల పాఠశాలను తరలిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యా యులు బద్వేలు టీడీపీ ఇనచార్జి రితేష్‌కుమార్‌రెడ్డితో మొరపెట్టుకోగా, ఆయన జిల్లా ఇనచార్జి మినిస్టరు సవిత, జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌తో మాట్లాడారు. వారు సాను కూలంగా స్పందించారని ఆ గురుకుల పాఠశాల అక్కడే ఉ ండేందుకు ఉన్నతాధికా రు లతో మాట్లాడుతానని వారికి హామీ ఇచ్చారు. అంతేకాకుండా సాంఘిక సంక్షేమ శాఖ మినిస్టరుతో మాట్లాడేందుకు ఆయన విజయవాడకు కూడా వెళ్లినట్లు తెలిసింది. కాగా సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను పక్క నియోజకవర్గానికి తరలించేందుకు ఒప్పుకోమని మండల టీడీపీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి తెలిపారు.

# ప్రాథమిక పాఠశాలను కొనసాగించాలి



డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు

కర్నూలు (టుడే విదుర, జూన్ 28): కల్లూరు మండలం గట్టయ్యనగర్ ప్రాథమిక పాఠశాలను యథావిధిగా కొనసాగించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జే.నాగేశ్వరరావు, సుధాకరప్ప డిమాండ్ చేశారు. డీఈవో కార్యాలయంలో డీఈవో శామ్యూల్‌పాల్‌ను సీఐటీయూ నాయకులు, తల్లిదండ్రుల కమిటీసభ్యుల కలిసి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గట్టయ్య నగర్‌లోని ప్రాథమిక పాఠశా లలో 50 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని, 3, 4, 5 తరగతులు ఒక కిలోమీటరు దూరంలో ఉన్న కస్తూర్బా పాఠశాలకు తరలించడం అన్యాయ మన్నారు. డీఈవో స్పం దిస్తూ ప్రభుత్వ పాలసీ విధానంలో కొన్ని పాఠశా లల విలీనాన్ని రద్దు చేశామని, కొన్ని పాఠశాలలను మరొక్క పాఠశాలకు తరలించామని చెప్పారు. సీఐటీయూ నాయకుడు యేసు, విద్యార్థుల తల్లిదం డ్రులు వెంకటలక్ష్మి, గౌరి, భారతి, సుశీల, రాధమ్మ పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కమిషనర్, అధికారులు
నగర పాలక కమిషనర్ రవీంద్రబాబు



కర్నూలు (టుడే విదుర, జూన్ 28): నగరంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకం నేషనల్ క్లీన ఎయిర్ ప్రోగ్రామ్(ఎనక్యాప్) పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, జాప్యం చేయకుండా సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. ఆయన నగరంలో వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీ లించారు. సుంకేసుల రోడ్డు, మద్దూర్‌నగర్, బి.క్యాంపు పోస్టాఫీసు నుంచి సి.క్యాంపు టీటీడీ కళ్యాణ మండపం వరకు, బి.క్యాంపు విజ్ఞాన మం దిరం ప్రాంతాల్లో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను కమి షనర్ పరిశీలించారు. ఆయన వెంట డిప్యూటీ కమిషనర్ సతీష్‌రెడ్డి, ఇనచార్జి ఎస్ఈ శేషసాయి, ప్రజారోగ్య అధికారి కె.విశ్వేశ్వరరెడ్డి, డీఈ ఈ గిరి రాజు, మనోహర్‌రెడ్డి, నరేష్, బిల్డింగ్ సూపర్‌వైజర్ అంజాద్ బాషా పాల్గొన్నారు.

# చిన్నారుల భవిష్యత్తుకు 'కేర్ అండ్ గ్రో'



చిత్తూరు,(టుడే విదుర, జూన్ 28): కుప్పం నియోజకవర్గంలోని అంగన్‌వాడీ పిల్లల మానసిక లోపాలను గుర్తించి సరి చేసేందుకు ప్రభుత్వం 'కేర్ అండ్ గ్రో' ప్రాజెక్టును ప్రారంభించింది. నియోజకవర్గంలోని 428 అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ దీన్ని చేపట్టనుండగా.. ప్రస్తుతం కొన్నింట్లో మాత్రమే ప్రారంభించారు. సీఎం చంద్రబాబు జూలై 2న కుప్పంలో పర్యటించనున్న సందర్భంగా, మిగిలిన కేంద్రాల్లోనూ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.గత ఏడాది అక్టోబరులో 25అంగన్వాడీ కేంద్రాల్లో 'కేర్ అండ్ గ్రో' ప్రాజెక్టను పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించారు. 1711మంది పిల్లలకు ఏఐ ఆధారిత పరీక్షలు చేశారు. వీరిలో 612మందికి ఒకటి కంటే ఎక్కువ లోపాలున్నట్లు గుర్తించారు. 39 మందికి నాలుగుకు మించి లోపాలున్నట్లు గుర్తించి, నిపుణుల వద్దకు పంపించారు. 30 రోజుల పాటు చేయాల్సిన పనుల్ని వారి తల్లిదండ్రులకు సూచించారు. శిక్షణ పొందిన ఫీల్డ్ కో ఆర్డినేటర్లు ఇళ్లకు వెళ్లి లోపాలున్న పిల్లల్ని పర్యవేక్షిస్తున్నారు. వచ్చే నెల రెండో వారంలో రెండో దశ స్క్రీనింగ్ పరీక్షల్ని ప్రారంభించనున్నారు.నియోజకవర్గంలోని 428 కేంద్రాలకు మే నెలలో జియోట్యాగింగ్ పూర్తి చేశాక ఈ నెల 11, 13 తేదీల్లో ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. లోపాలున్న పిల్లల తల్లిదండ్రులకు 90కిపైగా వాట్సాప్ గ్రూపుల్ని ఏర్పాటుచేశారు. రోజూ ఆ గ్రూపుల్లో పిల్లలతో చేయించాల్సిన పనుల గురించి వీడియోలు, మెసేజ్‌లు పంపిస్తుంటారు. మాట్లాడే, అరిచే, రాసే, భావోద్వేగాలు (ఎమోషన్స్) పలికించేలా శిక్షణ ఇస్తున్నారు. ఈ ప్రాజెక్టును నిర్వహించేందుకు రూ.2.89 కోట్లను ప్రభుత్వం కేటాయించింది.

# 20 కిలోల గంజాయి స్వాధీనం



సూళ్లూరుపేట,(టుడే విదుర, జూన్ 28) : సూళ్లూరుపేటలో 20 కిలోల గంజాయి పట్టుకుని.. అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. డీఎస్పీ చెంచుబాబు తెలిపిన ప్రకారం.. సత్యవేడు మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన తొండా మునిశేఖర్, సూళ్లూరుపేట మండలం ఆబాకకు చెందిన ఏలిమేటి సతీష్, సూళ్లూరుకు చెందిన పాలా వినయ్, తడ మండలం గ్రద్దగుంటకు చెందిన మధురాజేష్, సత్యవేడు మండలం అయ్యప్పపాలెం గ్రామానికి చెందిన సోదవరం జ్యోతీష్ కుమార్ ముఠాగా ఏర్పడ్డారు. ఒడిశా నుంచి గంజాయి తెచ్చి సూళ్లూరుపేట, తడ, చెన్నై తదితర ప్రాంతాల్లో విక్రయించేవారు. మన్నారుపోలూరు వద్ద పెట్రోల్ బంకు ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో గంజాయిని తరలించేందుకు సిద్ధం చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 20 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని, దీని విలువ సుమారు రూ.3.50 లక్షలు ఉ ంటుందని డీఎస్పీ చెప్పారు. గంజాయిని పట్టుకున్న సీఐ మురళీకృష్ణ, సూళ్లూరుపేట, తడ ఎస్ఐలు బ్రహ్మానాయుడు, కొండపనాయుడు, సిబ్బందిని అభినందించారు.

# పెరియవరం గ్రామంలో ఉచిత వైద్య సేవలు




రాజంపేట (టుడే విదుర, జూన్ 28) : పుల్లంపేట మండలంలోని పెరియవరం గ్రామాన్ని రాజంపేట ఇండియన మెడికల్ అసోసియేషన వారు దత్తత తీసుకుని ఉచిత వైద్య సేవలు అందించారు. అసోసియేషన అధ్యక్షుడు చలమయ్య, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎస్.బాలరాజు, కార్యదర్శి జి.శ్రీహరి, కోశాధికారి ఎన.ధనశ్రీ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించి ఉ చితంగా షుగర్, బీపీ వ్యాధులకు మందులను పంపిణీ చేశారు. గ్రా మంలోని ప్రతిఒక్కరికి హెల్త్‌కార్డులు అందజేశారు. ఇండియన మెడికల్ అసోసియేషన సభ్యులు డాక్టర్ చెన్నూరు సునీల్, జగనమోహన, అనిల్‌కుమార్, అరవింద్, లలిత తదితరులు పాల్గొన్నారు.

# ఒక టీచర్.. ఒక విద్యార్థిని

## ఇదీ నారుపేట ప్రభుత్వ పాఠశాల పరిస్థితి



(టుడే విదుర, జూన్ 28): ఇది భోగాపురం మండలం అమటాంరావివలస పంచాయతీ నారుపేట ప్రభుత్వ పాఠశాల. ఇక్కడ ఒకేఒక్క విద్యార్థిని చదువుతోంది. 2వ తరగతికి చెందిన ధనుశ్రీ అనే బాలిక విద్యనభ్యసిస్తోంది. లక్ష్మి అనే ఉపాధ్యాయురాలు ఈ బాలికకు చదువు చెబుతున్నారు. గత ఐదేళ్లుగా ఇద్దరు లేక ముగ్గురు విద్యార్థులతో పాఠశాల నిర్వహిస్తున్నారు. గతేడాది ఇక్కడ 1,4,5 తరగతులకు సంబంధించి ముగ్గురు విద్యార్థులు ఉండేవారు. ఈ ఏడాది ప్రభుత్వం 1, 2 తరగతులకు సంబంధించి ఫౌండేషన్ స్కూల్‌గా నిర్వహిస్తుంది. దీంతో ఇక్కడ ఫౌండేషన్ స్కూల్‌లో రెండో తరగతికి చెందిన ధనుశ్రీ మాత్రమే ఉంది. ఈ పాఠశాలకు భవనం లేక గ్రామస్థులకు చెందిన ఓ రేకుల షెడ్డులో నిర్వహిస్తున్నారు. దీనిపై ఉపాధ్యాయురాలు లక్ష్మిని వివరణ కోరగా.. 'ఇక్కడ గతంలో ముగ్గురు విద్యార్థులు ఉండేవారు. ఇప్పుడు ఫౌండేషన్ స్కూల్ కావడంతో 2వ తరగతికి చెందిన ఒక విద్యార్థిని మాత్రమే ఉంది. కొత్తగా ఎవరూ చేరలేదు.' అని తెలిపారు.

# మందలిస్తున్నాడని చంపేశాడు..

**వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాఘవులు, సీఐ సతీష్‌కుమార్, ఎస్ఐ రమేష్**

**వాచ్‌మన్ హత్య కేసులో నిందితుడి అరెస్టు**

**- రిమాండ్‌కు తరలింపు**

**- వివరాలు వెల్లడించిన డీఎస్పీ రాఘవులు**



బొబ్బిలి, (టుడే విదుర, జూన్ 28): బొబ్బిలి గ్రోత్‌సెంటర్‌లోని రాఘవ కనస్ట్రక్షన్స్ (ఎలక్ట్రికల్) స్టోర్ వాచ్‌మన్ కనిమెరకల వెంకటరమణ (55) హత్య కేసును పోలీసులు ఛేదించారు. మృతుడి కుమార్తెకు పరిచయమున్న యువకుడే ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. తనను మందలిస్తున్నాడని వెంకటరమణను చంపేశాడు. టెక్నాలజీ సాయంతో నిందితుడిని గుర్తించి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ వివరాలను స్థానిక పోలీసుస్టేషన్‌లో రాత్రి చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు విలేకరులకు వెల్లడించారు. బొబ్బిలి పట్టణంలోని దిబ్బవీధికి చెందిన వెంకటరమణ గ్రోత్‌సెంటర్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 20న అర్ధరాత్రి విధుల్లో ఉండగా గుర్తుతెలియని వ్యక్తి వచ్చి ఆయన్ను తీవ్రంగా కొట్టి గాయపరిచి పారిపోయాడు. వెంకటరమణ గాయాలతో సమీపంలోని పెట్రోల్ బంకుదగ్గరికి వెళ్లి కుప్పకూలి పోయాడు. అక్కడ ఉన్న వారు వెంకటరమణ ఫోన్ నుంచి అతని కుమారుడు పురుషోత్తంకు ఫోన్ చేసి సమాచారం అందించారు. వెంటనే ఆయన వచ్చి తండ్రిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వెంకటరమణ పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు విజయనగరం మహారాజా ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ కటకం సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ రమేష్ ఇతర సిబ్బంది రంగంలోకి దిగారు. బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేశారు. ఘటనా స్థలంలో నిందితుని పర్సు, ఫొటో లభ్యమయ్యాయి. సెల్‌ఫోన్ నెంబర్ ఆధారంగా నిందితుని ఆచూకీ కనుక్కోగలిగారు. పాతబొబ్బిలికి చెందిన కోట సర్వేశ్వరరావు(20) అనే యువకుడు ఈ ఘాతుకానికి పాల్పడినట్లు పోలీసులు నిర్ధారించారు. అతన్ని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడు సర్వేశ్వరరావు ఓ చికెన్ సెంటరులో పనిచేస్తున్నాడు. మృతుడు వెంకటరమణ కుమార్తె అదే చికెన్ సెంటరులో అకౌంటెంట్‌గా పనిచేస్తోంది. దీంతో వీరిమధ్య పరిచయం ఏర్పడింది. ఈ విషయంలో వెంకటరమణ ఇంట్లో గొడవలు జరుగుతుండేవి. సర్వేశ్వరరావును కూడా వెంకటరమణ మందలించేవాడు. దీంతో వెంకటరమణను హతమార్చాలని సర్వేశ్వరరావు వ్యూహం పన్నాడు. ఈ నెల 20న రాత్రి వెంకటరమణ పనిచేసే చోటకు వెళ్లి చాలాసేపు కాపు కాశాడు. సమయం చూసి ఆయన్ను తీవ్రంగా కొట్టి గాయపరిచాడు. వెంకటరమణ మృతి చెందాడని అనుకుని అక్కడ నుంచి జారుకున్నాడు. టెక్నాలజీ సహాయంతో నిందితుని ఫోన్ సిగ్నల్స్, ఇతరత్రా ఆధారాలను పోలీసులు సేకరించారు. నేరాన్ని అంగీకరించడంతో సర్వేశ్వరరావును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ రాఘవులు తెలిపారు. హత్యకేసును ఛేదించిన సీఐ కటకం సతీష్‌కుమార్, ఎస్ఐ రమేష్, సిబ్బందిని అభినందించారు.

# నాటు సారా విక్రయిస్తే కఠిన చర్యలు



లక్కిరెడ్డిపల్లె, (టుడే విదుర, జూన్ 28): నాటుసారా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని లక్కిరెడ్డిపల్లె అర్బన స్టేషన ఎక్సైజ్‌సీఐ కిశోర్‌కుమార్ హెచ్చరించారు. కోనంపేట పంచాయతీలో ని వడ్డెపల్లిలో నాటుసారా విక్రయాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటుసారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు అధికారులు విస్తృత దాడులు చేపట్టారన్నారు. ఆ గ్రామ సర్పంచ, రెవెన్యూ అధికారి, మహిళా పో లీస్, కమిటీ సభ్యులు అటవీశాఖ బీట్ అధికారి, గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్, స్వయం సహాయక సంఘాలు నాటుసారాపై అవగాహన కల్పించాలన్నారు. ఎవరైనా నాటు సారా కాచి విక్రయిస్తే 12405 లేదా 9440902594కు ఫోన చేసి తెలియజేయాలన్నారు.

# ఇవ్వాలా? వద్దా?



**మరో మూడు రోజుల్లో పూర్తికానున్న బదిలీల ప్రక్రియ**


**- వేరే మండలాలకు స్థానచలనం**

**- సర్వీస్ రికార్డు ప్రకారం సొంత మండలం గుర్తింపు**

(టుడే విదుర, జూన్ 28): జిల్లాలోని ఓ గ్రామ సచివాలయంలో పని చేస్తున్న ఓ ఉద్యోగి తనకు దగ్గరగా ఉంటుందని పక్క మండల పరిధిలోని ఓ సచివాలయానికి బదిలీ కోసం ఓ ప్రజాప్రతినిధి నుంచి సిఫారసు లేఖ పొందాడు. అయితే, ఈ లేఖను అధికారులు పరిగణలోకి తీసుకుంటారో.. లేదోనని ఆయన అనుమానం వ్యక్తం చేస్తున్నాడు. ఇటీవల కొన్ని శాఖల్లో జరిగిన బదిలీలకు సంబంధించి కొన్ని పోస్టులకు ప్రజా ప్రతినిధులు ఇచ్చిన సిఫారసులకు అధికారులు విలువ ఇచ్చారు. మరి కొన్ని పోస్టుల విషయంలో మాత్రం పక్కన పెట్టేశారు. సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో కూడా ఇదే పరిస్థితి ఉంటుందని సిఫారసు లేఖలు పొందిన వారిలో ఆందోళన నెలకొంది. శృంగవరపుకోట, మరో మూడు రోజుల్లో సచివాలయ ఉద్యోగుల బదిలీ ప్రక్రియ పూర్తికానుంది. ఒకేచోట ఐదేళ్లు పనిచేసిన ఉద్యోగులను ప్రభుత్వం బదిలీ చేయనుంది. జిల్లాలోని 626 గ్రామ, వార్డు సచివాలయాల్లో 5,781 మంది వరకూ ఉద్యోగులు పనిచేస్తుండగా, వీరిలో 3 వేల మందికి స్థానచలనం జరగనుంది. అయితే, హేతుబద్ధీకరణలో భాగంగా పోస్టులు సగానికి తగ్గిపోవడం, సొంత మండలాల్లో పోస్టింగ్‌కు అవకాశం లేకపోవడంతో సచివాలయ ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. ఈ క్రమంలో కొందరు ఉద్యోగులు తమకు అనువైన చోటకు వెళ్లేందుకు సిఫారసు లేఖల కోసం ఎగబడుతున్నారు. స్థానిక కూటమి నేతల సాయంతో ఎమ్మెల్యేలను కలిసి సిఫారసు లేఖలు పొందుతున్నారు. అయితే ఈ లేఖలను ఆయా శాఖల విభాగాధిపతులకు ఇవ్వాలా? వద్దా? అన్న సంశయంలో పడ్డారు.

# బిందు సేద్యం రైతాంగానికి మేలు

యర్రగొండపాలెం(టుడే విదుర, జూన్ 28): బిందు సేద్యంతో రైతాంగానికి ఎంతో ఉపయోగమని ఏపి మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ సిహెచ్ శ్రీనివాసులు అన్నారు. ఆయన మిల్లంపల్లి పంచాయతీ పరిధిలోని భూములలో ప్రభుత్వ సబ్సిడీతో ఏర్పాటు చేసిన డ్రిప్పు పరికరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు పది వేల హెక్టార్లలో డ్రిప్పు పరికరాలు ఏర్పాటు చేయాలని టార్గెట్ కాగా ఇప్పటి వరకు 6,900 మంది రైతుల ద్వారా రిజిస్ట్రేషన్ జరిగినట్లు తెలిపారు. ఎనిమిది వేల హెక్టార్లకు డ్రిప్పు పరికరాల కోసం దరఖాస్తులు అందాయన్నారు. జూన్, జులై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో ప్రభుత్వం నిర్దేశించిన టార్గెట్‌ను పూర్తి చేస్తామన్నారు. ఐదు ఎకరాల లోపు ఎస్సీ, ఎస్టీ రైతులకు ప్రభుత్వం వంద శాతం సబ్సిడీ అందజేస్తుందని చెప్పారు. అలాగే ఐదు ఎకరాల లోపు భూమి ఉన్న సన్న, చిన్న కారు రైతులకు 90 శాతం, ఐదు ఎకరాలకు పైబడి పది ఎకరాలకు లోపు ఉన్న మధ్య తరగతి రైతులకు 70 శాతం సబ్సిడీ, పది ఎకరాలకు పైబడి 12.5 ఎకరాలు ఉన్న రైతులకు 50 శాతం సబ్సిడీపై డ్రిప్పు పరికరాలు అందజేస్తున్నట్లు తెలిపారు. డ్రిప్పు పరికరాలు కావాల్సిన రైతులు సంబంధిత సచివాలయాల్లో విఏఏ, విహెచ్ఏలను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ప్రభుత్వం గుర్తించిన 22 కంపెనీలకు చెందిన పరికరాల్లో ఏ కంపెనీకి చెందినవైనా తీసుకోవచ్చని తెలిపారు. డీడీ రూపంలో చెల్లించే నగదును దళారులకు ఇవ్వకూడదని చెప్పారు. ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని వివరించారు. జిల్లాలో ఎక్కువగా డ్రిప్పు పరికరాలను పశ్చిమ ప్రకాశంలో ఏర్పాటు చేసేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. పొలాల్లోని బోర్ల దగ్గర ఫారం పాండ్స్ నిర్మించుకుంటే వర్షపు నీరంతా ఫారం పాండ్స్ ద్వారా బోర్లలోకి చేరి భూగర్భజల



మట్టం పెరుగుతుందని చెప్పారు. తద్వారా బోర్లు బాగా పని చేస్తాయని తెలిపారు. పంట పొలాల్లో ప్రతి నీటి చుక్క వృథా చేయకుండా సద్వినియోగం చేయడం ద్వారా భవిష్యత్తులో నీటి విపత్తు తలెత్తకుండా ఉండేందుకు ప్రభుత్వం రైతులకు సబ్సిడీ ద్వారా డ్రిప్పు పరికరాలు అందిస్తుందని వివరించారు.

# రహదారిపై మురునీరు పరిశీలన

కొండపి(టుడే విదుర, జూన్ 28): కొండపి పంచాయతీ పరిధిలోని కట్టావారిపాలెం గ్రామంలోని ఆర్అండ్ బి రోడ్డుపై నిలిచిన మురుగునీటిని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామంలో సైడు డ్రైనీజి కాలువలు లేని కారణంగా నివాస గృహాల నుంచి వచ్చే మురుగునీరు బయటకు వెళ్లే వీలులేక రోడ్డుపైనే నిలుస్తున్నట్లు గ్రామస్తులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మురుగునీటితో అనేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. దీంతో స్పందించిన మంత్రి మురుగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.



# చీకట్లో నగరం

విజయనగరం రింగురోడ్డు, (టుడే విదుర, జూన్ 28): జిల్లా కేంద్రం విజయనగరం అంధకారంలో మగ్గుతోంది. రాత్రి 7 గంటలైతే చాలు అనేక డివిజన్లలో చీకట్లు కమ్ముకుంటున్నాయి. రాత్రి వేళల్లో వీధి దీపాలు, సెంట్రల్ లైట్లు, హైమాస్ట్ లైట్లు వెలగకపోవడమే దీనికి కారణం. మొత్తం 50 డివిజన్ల పరిధిలో 19 వేల వీధి దీపాలు (ఎల్ఈడీలు), 2 వేల సెంట్రల్, హైమాస్ట్ లైట్లు ఉన్నాయి. ఇందులో 4 వేలకు పైగా ఎల్ఈడీలు, 300 పైగా సెంట్రల్, హైమాస్ట్ లైట్లు వెలగడం లేదు. కొత్తపేట, బంగారమ్మపేట, సాకేటి వీధి, పల్లివీధి, దాసన్నపేట, పూల్‌బాగ్ కాలనీ, ధర్మపురి, పద్మావతి నగర్, మంగళ వీధి, ఉడాకాలనీ, బాబామెట్ట, కంటోన్మెంట్ ఇలా చాలా డివిజన్లలో రాత్రుళ్లు వీధి దీపాలు వెలగక చీకట్లు కమ్ముకుంటున్నాయి. అదే విధంగా



అంబేద్కర్ జంక్షన్ నుంచి భాష్యం స్కూల్ జంక్షన్ వరకు, దాసన్నపేట రింగురోడ్డు, పూల్‌బాగ్, ఆర్టీసీ కాంప్లెక్స్, ప్రదీప్ నగర్ రోడ్డు, వీటీ అగ్రహారం రోడ్డు, వై జంక్షన్ తదితర ప్రాంతాల్లో సెంట్రల్ లైట్లు, హైమాస్ట్ లైట్లు వెలగని పరిస్థితి నెలకొంది. నగర సుందరీకరణలో భాగంగా ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన సెంట్రల్, హైమాస్ట్ దీపాలు నాణ్యతగా లేకపోవడంతో అవి కొన్ని రోజులే వెలుగుతున్నాయి. తరువాత మరమ్మతులకు గురవుతున్నాయి. అలాగే, వీధి దీపాలపై సంబంధిత సిబ్బంది పర్యవేక్షణ కరువైంది. అవి వెలుగుతున్నాయా? లేదా? అన్నది పట్టించుకోవడం లేదు.



# టుడే వినోదం

## కమల్ హాసన్‌కు అరుదైన గౌరవం




ప్రపంచ చిత్రపరిశ్రమలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే ఆస్కార్ అకాడెమీలో కోలీవుడ్ అగ్ర నటుడు కమల్ హాసన్‌కు అరుదైన గౌరవం లభించింది. ఆస్కార్ అకాడెమీలో సభ్యులుగా చేరాలంటూ కమల్ హాసన్‌తో పాటు పలువురు భారతీయ ప్రముఖ నటీనటులకు ఆహ్వానం లభించింది. ఈ మేరకు 'ది అకాడెమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్' తాజాగా విడుదల చేసిన కొత్త సభ్యుల జాబితాలో కమల్ హాసన్ పేరు ఉంది. ఎంతోమంది హాలీవుడ్ నటీనటులతో పాటు ఆస్కార్ ఓటింగ్ ప్రక్రియలో కమల్ హాసన్ పాలుపంచుకోనున్నారు. ఆస్కార్‌కు నామినేట్ అయ్యే చిత్రాల్లో ఫైనల్ ఎంపిక ప్రక్రియలో వీరికి ఓటు వేసే అవకాశాన్ని కల్పిస్తుంది. కాగా, ఈ ఏడాది మొత్తం 534 మంది సభ్యులను ఆహ్వానించినట్టు అకాడెమీ తెలిపింది. ప్రతిభావంతులైన వీరికి అకాడెమీలో చోటు కల్పించడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొంది.

## మా అన్న ఇంత బాగా చేస్తాడనుకోలేదు



మనోజ్ తన సోదరుడు విష్ణును పొగడడం మంచు అభిమానులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేసింది. విష్ణు ప్రధాన పాత్రలో నటించిన 'కన్నప్ప' చిత్రం శుక్రవారం విడుదలైంది. మనోజ్ ఈ సినిమాను థియేటర్‌లో చూశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సినిమా చాలా బాగుంది. నేను అనుకున్న దానికంటే వెయ్యి రెట్లు బాగా వచ్చింది. చివరి 20 నిమిషాలు అదిరిపోయింది. ప్రభాస్ యాక్టింగ్ అదిరింది. మా అన్న కూడా ఇంత బాగాచేస్తాడనుకోలేదు. ఈ సినిమా ఘన విజయాన్ని అందుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నా' అని అన్నారు. కాగా, గత కొన్ని రోజులుగా మంచు కుటుంబంలో నెలకొన్న కలహాలు తెలిసిందే. ఈ క్రమంలో సినిమా విడుదలకు ఒక రోజు ముందు 'కన్నప్ప' చిత్రబృందానికి ఆల్ ద బెస్ట్ చెబుతూ మనోజ్ ట్వీట్ చేశారు. ఇందులో విష్ణు పేరును ప్రస్తావించకపోవడం గమనార్హం. అయితే సినిమా చూసిన తర్వాత తన అన్న విష్ణును మనోజ్ మెచ్చుకోవడంతో ఫ్యామిలీ అంతా మళ్లీ ఒక్కటయ్యే సమయం ఆసన్నమవుతోంది అంటూ మంచు అభిమానులు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నారు.

## ఇలియానా.. రెండో బిడ్డ.. పేరు ఇదే




గోవా బ్యూటీ ఇలియానా మరోసారి తల్లి అయ్యారు. ఈ నెల 19న పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చినట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. తన బిడ్డ బాబు ఫొటోను అభిమానుతో పంచుకున్నారు. ''మా ప్రియమైన అబ్బాయి 'కియాను రఫే డోలన్'ని పరిచయం చేస్తున్నందుకు మా మనసు సంతోషంతో నిండిపోయింది' అనే క్యాప్షన్ పెట్టారు. ఇలియానా పోస్ట్ చూసిన ఫాన్స్, పలువురు నెటిజన్లు ఇల్లి బేబీకి అభినందనలు చెబుతున్నారు. బాలీవుడ్ బ్యూటీ ప్రియాంక చోప్రా ఈ పోస్ట్‌కు స్పందిస్తూ విష్ చేశారు. %2023లో మైఖేల్ డోలన్‌ను ఇలియానా వివాహం చేసుకున్నారు. అదే ఏడాది ఆగస్టులో మొదటి బిడ్డకు జన్మనిచ్చారు. అతని పేరు కోవా ఫీనిక్స్ డోలన్. పెళ్లి, భర్త గురించి వచ్చిన విమర్శల్ని పట్టించుకోకుండా ముందుకెళ్తున్నారు ఇలియానా. 'నన్నేమన్నా భరిస్తా.. కానీ నా కుటుంబసభ్యులను ఏమైనా అంటే ఊరుకోను' అని గతంలో ఆమె పోస్ట్ పెట్టిన సంగతి తెల్సిందే.

## గర్జన వినడానికి కాదు.. భయపెట్టడానికి




సాంప్రదాయక చీర, ముక్కు పుడక, ఇతర ఆభరణాలతో గోండు యువతిగా రష్మిక కనిపించే కొత్త చిత్రం 'మైసా'. దర్శకుడు హను రాఘవపూడి శిష్యుడు రవీంద్ర పుల్లే ఈ సినిమాతో దర్శకుడిగా పరియమవుతున్నారు. అజయ్, అనిల్ సయ్యపురెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రం ఫస్ట్ లుక్, పోస్టర్‌ను దర్శకుడు హను రాఘవపూడి విడుదల చేశారు. తమిళ పోస్టర్‌ను తమిళ హీరో ధనుష్, మలయాళ పోస్టర్‌ను దుల్కర్ సల్మాన్, కన్నడ పోస్టర్‌ను శివరాజ్ కుమార్, హిందీ పోస్టర్‌ను విక్కీ కౌశల్ విడుదల చేశారు. వీరందరూ రష్మికకు శుభాకాంక్షలు తెలిపారు. ఇంతకు ముందెన్నడూ చూడని విధంగా ముఖాన రక్తపు మరకలు, చేతిలో ఆయుధంతో కొత్తగా కనిపించారు రష్మిక. 'ఓర్పు ఆమె ఆయుధం. ఆమె గర్జన వినడానికి కాదు.. భయపెట్టడానికి' అని చిత్ర నిర్మాణ సంస్థ పేర్కొంది. టైటిల్, ఆమె లుక్.. ప్రాజెక్ట్ మీద అంచనాలు పెంచాయి. 'రెండేళ్ల కష్టానికి రూపం 'మైసా' చిత్రం. గోండు తెగల ప్రపంచం ఆధారంగా ఎమోషనల్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ సినిమా ఉంటుంది' అని దర్శకుడు చెప్పారు.

## బాలీవుడ్ లో విషాదం.. నటి హఠాన్మరణం




బాలీవుడ్ నటి షెఫాలీ జరీవాలా కన్నుమూశారు. శుక్రవారం (27న ) రాత్రి ఆమెకు గుండె పోటు రావడంతో మరణించినట్టు బాలీవుడ్ మీడియా చెబుతోంది. నాటి 'కాంటా లగా' పాటతో ఆమె దేశవ్యాప్తంగా పాపులర్ అయ్యారు. మీడియా కథనాల ప్రకారం, అనారోగ్యానికి గురైన షెఫాలీని ఆమె భర్త ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించారు. అయితే, ఆమె మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. %2002లో 'కాంటా లగా' పాటలో నటించిన షెఫాలీ రాత్రి రాత్రికి పాప్ కల్చర్ సెన్సేషన్‌గా మారిపోయారు. ప్రముఖ నటులు సల్మాన్ ఖాన్, అక్షయ్ కుమార్ నటించిన 2004 నాటి 'ముఝ్ సే షాదీ కరోగీ' సినిమాలో కూడా నటించారు. బిగ్ బాస్ 13 సీజన్‌లో కూడా పాల్గొన్నారు. తన కాన్ఫిడెన్స్, క్లారిటీతో జనాలను ఆకట్టుకుని మరోసారి లైమ్ లైట్‌లోకి వచ్చారు. 2015లో ఆమె యాక్టర్ పరాగ్ త్యాగి ని పెళ్లి చేసుకున్నారు. 'నచ్ బలియే' డ్యాన్స్ రియాలిటీ షో 5, 7 సీజన్‌లలో భర్తతో కలిసి పాల్గొన్నారు. చిన్న వయసులో ఆమె కన్నుమూయడం ఇండస్ట్రీ వర్గాలను దిగ్భ్రాంతికి గురి చేసింది.

## జూనియర్.. నో ఫియర్



ప్రముఖ రాజకీయ నాయకుడు, వ్యాపారవేత్త గాలి జనార్ధన రెడ్డి కుమారుడు కిరీటి రెడ్డి హీరోగా ఎంట్రీ ఇస్తున్న చిత్రం 'జూనియర్'. యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని రాధాకృష్ణ దర్శకత్వంలో రజని కొర్రపాటి నిర్మిస్తున్నారు. ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. ఇందులో 'జూనియర్.. నో ఫియర్' అనిపించే హుషారైన కాలేజీ కుర్రాడిగా కిరీటి కనిపించారు. తన చుట్టూ ఉన్న వారిని ఆకర్షించే వ్యక్తిత్వం ఉన్న ఈ యువకుడు శ్రీలీలను ఇష్టపడతాడు. గొడవతో మొదలైన వారి జర్నీ క్రమంగా ఎట్రాక్టివ్ కెమిస్ట్రీగా మారుతుంది. ఈ టీజర్‌లో కిరీటి అదరగొట్టాడనే చెప్పాలి. తన డ్యాన్స్, స్టంట్స్, స్పాట్ ఆన్ కామిక్ టైమింగ్ అద్భుతంగా ఉన్నాయి. అలాగే కిరీటి చెప్పిన డైలాగులు ఆకట్టుకున్నాయి. ఈ సినిమాలో శ్రీలీల కథానాయికగా నటిస్తున్నారు. టీజర్ చివరిలో బాస్ పాత్రలో జెనీలియా డిసౌజా కనిపించడం ఆసక్తికరం. అలాగే హాస్య పాత్రలో వైవా హర్ష కనిపించారు. కె.కె. సెంథిల్ కుమార్ సినిమాటోగ్రఫీ గ్రాండ్ విజువల్స్‌తో అద్భుతంగా ఉంది. అలాగే దేవిశ్రీప్రసాద్ సంగీతం కూడా అలరించింది. తెలుగు, కన్నడ, తమిళ, మలయాళ, హిందీలో భాషల్లో జులై 18న గ్రాండ్‌గా 'జూనియర్' విడుదల కానుంది.

## మరింత ఘాటుగా టాప్ లేపిన విష్ణుప్రియ..




పోవే పోరా షో ద్వారా యాంకర్ విష్ణుప్రియ మంచి గుర్తింపును అందుకుంది. సుడిగాలి సుధీర్ రష్మీ తరువాత విష్ణునే మంచి జోడీ అని పేరు తెచ్చుకున్నారు. ఇక ఆ తరువాత విష్ణు నెమ్మది నెమ్మదిగా స్టార్ గా మారింది. ఒకపక్క షోస్ చేస్తూనే ఇంకోపక్క సోషల్ మీడియాలో అందాలను అరబోయడంతో అమ్మడు త్వరగానే గుర్తింపు తెచ్చుకుంది. ఆ గుర్తింపుతోనే సినిమాల్లో కీలక పాత్రలు చేయడం మొదలుపెట్టింది. ఇక అదే గుర్తింపుతో గత సీజన్ బిగ్ బాస్ లో కంటెస్టెంట్ గా మారింది. %బిగ్ బాస్ లోకి వెళ్ళాక కానీ, అమ్మడి గుట్టు బయటపడలేదు. ఏదో ఆడేసి రచ్చ చేస్తుందేమో అనుకుంటే.. పృథ్వీ శెట్టితో పులిహోర కలిపి.. స్నేహం, ప్రేమ అంటూ చెప్పుకొచ్చింది. ఆ తరువాత అదంతా తూచ్ మేము కేవలం ఫ్రెండ్స్ మాత్రమే.. అని చెప్పుకొచ్చి జనాలను పిచ్చోళ్లను చేసింది. ఇక బిగ్ బాస్ నుంచి బయటకు వచ్చాకా కూడా విష్ణు- పృథ్వీల జంటను షో యాజమాన్యం బాగానే క్యాష్ చేసుకుంటున్నారు. వీరిద్దరూ జంటగా వస్తే రేటింగ్ పెరుగుతుందని అలానే తీసుకురావడం మొదలుపెట్టారు.

# టుడే స్పోర్ట్స్

## యూజెడ్ విజేత ప్రజ్ఞానంద

తాష్కెంట్: గ్రాండ్‌మాస్టర్ ఆర్.ప్రజ్ఞానంద యూజెడ్ చెస్ కప్‌లో విజేతగా నిలిచాడు. దాంతో లైవ్ రేటింగ్‌లో భారత టాప్ ర్యాంక్ ఆటగాడిగా నిలిచాడు. ఈ టోర్నీ విజయంతో ప్రజ్ఞానంద రేటింగ్ 2778.3కి చేరింది. ఫలితంగా అతడు ఫిడే ప్రపంచ ర్యాంకింగ్స్‌లో మూడు స్థానాలు ఎగబాకి నాలుగో స్థానం దక్కించుకున్నాడు. కెరీర్‌లో ప్రజ్ఞానందకిది అత్యుత్తమ ర్యాంక్. ఈక్రమంలో వరల్డ్ చాంపియన్ గుకేష్ (2776.6), గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి (2775.7)ని 19 ఏళ్ల ప్రజ్ఞానంద వెనక్కు నెట్టాడు. కాగా..గురువారం వరకు అర్జున్ భారత టాప్ ర్యాంక్ ఆటగాడిగా కొనసాగాడు. తాజా ర్యాంకుల్లో అతడు ఆరో స్థానానికి దిగజారగా, గుకేష్ ఐదో ర్యాంక్‌లో నిలిచాడు.



## పాక్‌తో టీ20 ప్రపంచకప్ మ్యాచ్..
## మమ్మల్ని హోటల్ బయటకు వెళ్లనివ్వలేదు: రోహిత్

గతేడాది అమెరికా-వెస్టిండీస్‌లో జరిగిన ప్రపంచకప్ మ్యాచ్‌లో టీమిండియా అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. ఫైనల్లో దక్షిణాఫ్రికాను ఓడించి టైటిల్ కైవసం చేసుకుంది. ఆ మెగా టోర్నీలో పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్ ఎంతో ఆసక్తికరంగా సాగింది. ఆ మ్యాచ్‌లో టీమిండియా ఆరు పరుగుల తేడాతో విజయం సాధించింది. ఆ మ్యాచ్‌కు ముందు జరిగిన ఆసక్తికర సంఘటన గురించి టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ తాజాగా వెల్లడించాడు.'భారత్-పాక్ మధ్య మ్యాచ్ ఎప్పుడూ ప్రత్యేకమే. గతేడాది టీ-20 ప్రపంచకప్‌లో భారత్-పాక్ మ్యాచ్‌కు ముందు మాకు ఓ షాకింగ్ విషయం చెప్పారు. భారత జట్టుకు ముప్పు ఉందని చెప్పారు. మ్యాచ్‌కు ముందు హోటల్ నుంచి మమ్మల్ని అడుగు బయటపెట్టనివ్వలేదు. హోటల్ గదుల్లోనే ఉంటూ ఆహారం తీసుకున్నాం. ఏదో జరుగుతోందని అర్థమైంది. మ్యాచ్ రోజు హోటల్ మొత్తం అభిమానులు, మీడియా ప్రతినిధులతో నిండిపోయింది. మాకు కనీసం నడిచే అవకాశం కూడా లేదు' అని రోహిత్ అప్పటి విషయాలను గుర్తు చేసుకున్నాడు. 'ఆ రోజు హోటల్ నుంచి స్టేడియంకు వచ్చే సమయానికి అంతా మారిపోయింది. స్టేడియం దగ్గర భారత్, పాక్ అభిమానులు కేరంతలు, నృత్యాలతో సందడి చేశారు. స్టేడియం దగ్గర పండగ వాతావరణం కనిపించింది. అప్పటి




వరకు ఉన్న ఒత్తిడి అంతా మాయమై ఉత్సాహం వచ్చింది. పాకిస్థాన్‌తో నేను చాలా మ్యాచ్‌లు ఆడాను. ఎప్పుడు ఆడినా అలాంటి ఉత్సాహం మాత్రం అద్భుతంగా ఉంటుంద'ని రోహిత్ పేర్కొన్నాడు. ఆ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన టీమిండియా 19 ఓవర్లలో 119 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం పాకిస్థాన్ 20 ఓవర్లలో 113 పరుగులు మాత్రమే చేసి ఆరు పరుగుల తేడాతో ఓటమిపాలైంది.

## మనమ్మాయిలకు భలే చాన్స్



నాటింగ్‌హామ్: భారత మహిళల జట్టు ఇంగ్లండ్‌తో తెల్లబంతుల పోరుకు సిద్ధమైంది. ఐదు టీ20లు, మూడు వన్డేల సుదీర్ఘ సిరీసకోసం ఇక్కడికి వచ్చిన హర్మన్ సేన.. శనివారం జరిగే మొదటి టీ20లో ఆతిథ్య ఇంగ్లండ్‌ను ఎదుర్కోనుంది. వచ్చే ఏడాది ఇంగ్లండ్ ఆతిథ్యమిచ్చే పొట్టి ప్రపంచ కప్‌లో స్థానిక పరిస్థితులకు అలవాటు పడేందుకు తాజా సిరీస్‌ను ఉపయోగించుకోవాలని భారత్ భావిస్తోంది. తద్వారా రాబోయే టీ20 ప్రపంచ కప్ జట్టు ఎంపిక సులువవుతుంది. డ్యాషింగ్ బ్యాటర్ షఫాలీ వర్మ పునరాగమనం జట్టుకు అదనపు బలం. ఇంకా..తెలుగమ్మాయి శ్రీచరణి, క్రాంతి గౌడ్, సయాలీ సత్ఘరే వంటి యువ్వరక్రికెటర్లకు జట్టులో చోటు కల్పించారు. గత కొన్ని మ్యాచ్‌ల్లో ఉమా ఛెత్రి విఫలమవుతున్న నేపథ్యంలో స్మృతి మంధానాతో కలిసి షఫాలీ ఇన్నింగ్స్‌ను ప్రారంభించనుంది. జట్టులోకి రీ ఎంట్రీ ఇచ్చిన ఆఫ్‌స్పిన్ ఆల్‌రౌండర్ స్నేహ్ రాణా, పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్ అమన్ జోత్ కౌర్ ఎలా రాణిస్తారో చూడాలి. సీనియర్ పేసర్లు రేణుకా సింగ్, పూజా వస్త్రాకర్ గాయాలతో జట్టుకు దూరం కావడం టీమిండియాకు ప్రతికూలం కానుంది. మరోవైపు కెప్టెన్ నాట్-సివర్ బ్రంట్‌కుతోడు అమీ జోన్స్, బ్యూమాంట్, డానీ వ్యాట్, ఎకిల్‌స్టోన్ వంటి అత్యంత అనుభవజ్ఞులతో ఇంగ్లండ్ పటిష్టంగా ఉంది.

## ప్రేయసిని రూమ్‌కు తీసుకొచ్చిన ధవన్..
## రూమ్మేట్ అయిన రోహిత్ శర్మ ఏమన్నాడంటే..

టీమిండియా మాజీ ఓపెనర్ శిఖర్ ధవన్ తన ఆత్మకథను 'ద వన్: క్రికెట్, మై లైఫ్ అండ్ మోర్' పేరుతో పుస్తకంగా రాశాడు. ఆ పుస్తకంలో ధవన్ ఎన్నో ఆసక్తికర, సంచలన విషయాలను ప్రస్తావించాడు. ముఖ్యంగా తాను భారత్-ఎ జట్టుకు ఆడే సందర్భంలో రోహిత్ శర్మ్ తో ఎదురైన అనుభవం గురించి ఆసక్తికరంగా చెప్పుకొచ్చాడు. 2006లో భారత్-ఎ జట్టు ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లింది. ఆ సమయంలో ధవన్‌కు, రోహిత్‌కు హోటల్‌లో ఒకే గదిని కేటాయించారు.అప్పటికే ప్రేమలో ఉన్న ధవన్ తన హోటల్ గదికి ప్రేయసిని తీసుకొచ్చేవాడట తన ప్రేయసి గురించి కూడా



ధవన్ రాసుకొచ్చాడు. 'ఆ అమ్మాయి చాలా అందంగా ఉండేది. ఆమెతో ప్రేమలో పడ్డా. ఆమె నా కోసమే పుట్టిందని, ఆమెను పెళ్లి చేసుకోబోతున్నా అని అనుకునేవాడిని. ఆ పర్యటనలో ఓ హాఫ్ సెంచరీ కూడా సాధించా. అంతా సాఫీగా సాగిపోతుండేది. ప్రతి మ్యాచ్ తర్వాత ఆమెను కలిసేవాడిని. ఆమెను నా హోటల్ గదికి కూడా తీసుకురావడం ప్రారంభించా. అప్పుడు నా రూమ్మేట్ రోహిత్ శర్మ. ఆమె వచ్చినప్పుడల్లా రోహిత్ ఇబ్బందిగా ఫీలయ్యేవాడు' అని ధవన్ రాశాడు.ధవన్ తన ప్రేయసిని హోటల్ గదికి తీసుకొస్తే రోహిత్.. 'నన్ను నిద్రపోనిస్తావా, లేదా' అని అడిగేవాడట. అయినా ధవన్ మాత్రం ఆమెను హోటల్‌కు తీసుకొస్తూనే ఉండేవాడట. ఒక రోజు ధవన్ తన ప్రేయసితో కలిసి నడుస్తుండగా జట్టు మొత్తం చూసేసిందంట. ఓ సీనియర్ సెలక్టర్ కూడా చూశాడట. అయినా ధవన్ ఆమె చేతులను విడవలేదట. తామేం తప్పు చేయలేదనే భావనతో ఉండడం వల్లే అంత ధైర్యంగా ఆమెతో కలిసి తిరిగేవాడట.

## విండీస్ స్టార్ క్రికెటర్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు




గయానా: ప్రస్తుత వెస్టిండీస్ జట్టులోని ఓ స్టార్ క్రికెటర్ లైంగిక ఆరోపణల వివాదంలో చిక్కుకున్నాడు. లైంగిక వేధింపులు, అత్యాచారం తదితర ఆరోపణలతో ఓ మైనర్ సహా 11 మంది మహిళలు సదరు క్రికెటర్‌పై గయానా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు విండీస్ మీడియా పేర్కొంది. స్థానిక పత్రిక కథనం ప్రకారం.. 2023 మార్చిలో న్యూఆమ్‌స్టర్‌డ్యామ్‌లోని ఓ నివాసంలో ఆ క్రికెటర్ తనపై లైంగిక దాడి చేశాడని 18 ఏళ్ల యువతితో పాటు ఆమె కుటుంబం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనతో మరికొందరు మహిళలు కూడా ఆ క్రికెటర్‌పై ఇవే ఆరోపణలు చేశారు. క్రికెటర్ చేసిన వాట్సాప్ సందేశాలు, వాయిస్ నోట్స్ లాంటి ఆధారాలను పోలీసులకు అందజేశారు. కానీ, ఇప్పటిదాకా ఆ ఆటగాడిపై ఎలాంటి కేసూ నమోదు కాలేదు. గతేడాది జనవరిలో బ్రిస్బేన్ వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టులో గెలిచిన విండీస్ జట్టులో ఆరోపణలు ఎదుర్కొంటున్న క్రికెటర్ ఉన్నాడని మీడియా వెల్లడించింది. ఆసీసపై విజయం అనంతరం గయానాకు తిరిగొచ్చినప్పుడు అతనికి ఘనంగా స్వాగతం కూడా పలికారని తెలిపింది. కాగా, ఆ ఆరోపణల విషయంపై తమకు పూర్తిగా తెలియదనీ, దీనిపై ఇప్పుడు వ్యాఖ్యానించలేమని విండీస్ క్రికెట్ బోర్డు ప్రకటించింది.

## ఇంగ్లాండ్ జట్టుపై 6 వికెట్ల తేడాతో భారత్ ఘన విజయం

ఐదు మ్యాచ్‌ల ఓడీఐ సిరీస్‌లోని మొదటి మ్యాచ్‌లో ఇంగ్లాండ్‌ను ఆరు వికెట్ల తేడాతో ఓడించి భారత అండర్ 19 జట్టు 1-0 ఆధిక్యంలో నిలిచింది. శుక్రవారం హోవ్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో, టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ జట్టు 42.2 ఓవర్లలో 10 వికెట్ల నష్టానికి 174 పరుగులు చేసింది. దీనికి సమాధానంగా భారత జట్టు 24 ఓవర్లలో నాలుగు వికెట్లకు 178 పరుగులు చేసి మ్యాచ్‌ను గెలుచుకుంది. భారత్ తరఫున వైభవ్ సూర్యవంశీ 48 పరుగులు చేయగా, అభిజ్ఞాన్ కుందు 45 పరుగులతో అజేయంగా నిలిచాడు.లక్ష్యాన్ని ఛేదించడానికి వచ్చిన భారత అండర్-19 జట్టు అద్భుతంగా రాణించింది. కెప్టెన్ ఆయుష్ మాత్రే 30 బంతుల్లో 21 పరుగులు చేసి అవుట్ కాగా, వైభవ్ సూర్యవంశీ 19 బంతుల్లో మూడు ఫోర్లు, ఐదు సిక్సర్లతో 48 పరుగులు చేశాడు. కానీ అతని హాఫ్ సెంచరీ మిస్ అయ్యాడు. విహాన్ మల్హోత్రా 18, మౌల్యరాజ్‌సిన్హ్ చావ్డా 16 పరుగులు చేశారు. అభిజ్ఞాన్ కుందు, రాహుల్ కుమార్ వరుసగా 45, 17 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. ఇంగ్లాండ్ తరఫున ఏఎం ఫ్రెంచ్ రెండు వికెట్లు పడగొట్టగా జాక్ హోమ్, రాల్ఫీ ఆల్బర్ట్ ఒక్కొక్క వికెట్ తీశారు.బిజె డాకిన్స్, ఐజాక్ మొహమ్మద్ ఇంగ్లాండ్‌కు మంచి ఆరంభం ఇచ్చేందుకు ప్రయత్నించారు. కానీ అతను 29 బంతుల్లో 18 పరుగులు మాత్రమే చేయగలిగాడు. ఆ తర్వాత మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన బెన్ మేస్‌ను అంబ్రిష్ వికెట్ కీపర్ కుందుకు క్యాచ్ ఇచ్చాడు. అతను 16 పరుగులు చేసిన తర్వాత ఔట్ అయ్యాడు. ఐజాక్ మొహమ్మద్ మూడో వికెట్‌కు రాకీ ఫ్లింటాఫ్‌తో కలిసి మంచి భాగస్వామ్యం అందించాడు.

## ప్రాక్టీస్.. ప్రాక్టీస్



బర్మింగ్‌హామ్: తొలి టెస్టులో ఓడిన భారత క్రికెట్ జట్టు ఇప్పుడిక తదుపరి మ్యాచ్‌పై దృష్టి సారించింది. రెండు రోజుల పాటు విశ్రాంతి తీసుకున్న గిల్ సేన తమ సన్నాహకాలను ఆరంభించింది. వచ్చే నెల 2 నుంచి ఎడ్జ్‌బాస్టన్ మైదానంలో ఇంగ్లండ్‌తో జరిగే ఈ రెండో టెస్టు కోసం ఆటగాళ్లంతా నెట్స్‌లో చెమటోడ్చారు. అయితే తొలి టెస్టులో ఎనిమిది క్యాచ్‌లను వదిలేసిన నేపథ్యంలో ఫీల్డింగ్ ప్రాక్టీస్‌పై దృష్టి సారించారు. క్యాచింగ్, నేరుగా విసిరిన త్రోలతో డ్రిల్స్ జరిగాయి. ఆ తర్వాత బౌలింగ్ సాధన సాగింది. అయితే పేసర్లు బుమ్రా, ప్రసిద్ధ్ క్రిష్ణ దీనికి దూరంగా ఉన్నారు. అటు సిరాజ్ అసిస్టెంట్ కోచ్ రియాన్ టెన్ డస్కటే ఆధ్వర్యంలో బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తూ కనిపించాడు. ముఖ్యంగా అతడి చేత షార్ట్ పిచ్ బంతులను కోచ్ ఆడించాడు. అనంతరం ఈ ముగ్గురు పేసర్లు కలిసి రన్నింగ్, ఫిట్‌నెస్ డ్రిల్‌లో పాల్గొన్నారే తప్ప బౌలింగ్ మాత్రం చేయలేదు. రెండో టెస్టులో బుమ్రాకు విశ్రాంతి ఇవ్వనున్నట్టు కథనాలు వినిపిస్తున్నాయి. హెడింగ్లీ పిచ్‌కన్నా ఎడ్జ్‌బాస్టన్‌లో వికెట్ స్పిన్‌కు అనుకూలంగా ఉండే అవకాశం ఉంది.

## టుడే బిజినెస్

# మరోసారి వారెన్ బఫెట్ భూరి విరాళం..
# గేట్స్ ఫౌండేషన్‌కు రూ.50 వేల కోట్లు..



ప్రపంచ కుబేరుల్లో ఒకరైన వారెన్ బఫెట్ మరోసారి తన పెద్ద మనసును చాటుకున్నారు. దాతృత్వంలో తనను మించిన వారు మరొకరు లేరని నిరూపించుకున్నారు. తాజాగా ఆయన మరోసారి భూరి విరాళం అందించారు. మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ నిర్వహిస్తున్న గేట్స్ ఫౌండేషన్ కు వేల కోట్ల రూపాయల సహాయాన్ని అందించారు. బఫెట్ ఇప్పటివరకు అందించిన విరాళాల్లో ఇది అతిపెద్ద వార్షిక విరాళంగా నిలిచింది.గేట్స్ ఫౌండేషన్‌తో మరో నాలుగు కుటుంబ ఛారిటీ సంస్థలకు విరాళంగా వారన్ బఫెట్ 6 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.50 వేల కోట్లు) విలువైన బెర్క్‌షైర్ హాత్ వే షేర్లను అందించారు. తాజా విరాళంలో గేట్స్ ఫౌండేషన్‌కు 9.43 మిలియన్ షేర్లు, సుసాన్ థాంప్సన్ బఫెట్ ఫౌండేషన్‌కు 9.4 లక్షల షేర్లు, బఫెట్ పిల్లలు హెూవార్డ్, సూసీ, పీటర్ నిర్వహిస్తున్న మూడు ఛారిటీ సంస్థలకు మొత్తంగా 6.6 లక్షల షేర్లు కేటాయించారు. దాదాపు రెండు దశాబ్దాల నుంచి బఫెట్ ఇలాంటి భూరి విరాళాలను అందిస్తూనే ఉన్నారు.బెర్క్‌షైర్ హాత్ వే అనేది వారెన్ బఫెట్‌కు చెందిన పెట్టుబడుల సంస్థ. తాజాగా 6 బిలియన్ డాలర్ల షేర్లను వదులుకున్న తర్వాత కూడా ఈ సంస్థలో బఫెట్ వాటా ఇంకా 13.8 శాతం ఉంది. ఈ విరాళానికి ముందు బఫెట్ నికర సంపద 152 బిలియన్ డాలర్లు. అయితే ఈ విరాళం తర్వాత బఫెట్ సంపద తగ్గడంతో పాటు ప్రపంచ కుబేరుల జాబితాలో ఆయన ఐదో స్థానం నుంచి ఆరో స్థానానికి వచ్చేస్తారు. ప్రస్తుతం 94 ఏళ్ల వయసులో ఉన్న బఫెట్ 2006 నుంచి విరాళాలను అందిస్తున్నారు.

# కొత్త ఫ్లాష్ సేల్ ఆఫర్.. రూ.400కు 400 జీబీ డేటా




భారత ప్రభుత్వానికి చెందిన టెలికాం సంస్థ బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు గుడ్ న్యూస్ తెలిపింది. ఈ క్రమంలో 4 డేటాను భారీ తగ్గింపులతో అందించే కొత్త ఫ్లాష్ సేల్‌ను అధికారికంగా ప్రకటించింది. ఈ సేల్ గురించి సంస్థ తన అధికారిక సోషల్ మీడియా ఛానెల్స్ ద్వారా వివరాలను పంచుకుంది. 90,000 4 టవర్స్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రకటించిన బీఎస్ఎన్ఎల్, 2025 మధ్యలో ఒక లక్ష 4 టవర్స్‌ను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించింది.

బీఎస్ఎన్ఎల్ లో చేసిన పోస్ట్ ప్రకారం, ఈ ఫ్లాష్ సేల్ జూన్ 28న ప్రారంభమైంది. జూలై 1 వరకు కొనసాగుతుంది. ఈ పరిమిత కాలంలో బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు కేవలం రూ. 400కి 400 డేటాను కొనుగోలు చేయవచ్చు. అంటే ప్రతి కి రూ. 1 ధర పడుతుందని చెప్పవచ్చు. ఈ ఆఫర్‌ను ఆసక్తి ఉన్న కస్టమర్లు బీఎస్ఎన్ఎల్ వెబ్‌సైట్ లేదా బీఎస్ఎన్ఎల్ సేవా యాప్ ద్వారా పొందవచ్చు. ఈ ఫ్లాష్ సేల్ ద్వారా, బీఎస్ఎన్ఎల్ వినియోగదారుల సంఖ్యను పెంచుకోవడంతోపాటు, కొత్త వినియోగదారులను ఆకర్షించడానికి కూడా ప్రయత్నిస్తోంది.

వినియోగదారుల సవాళ్లు

తాజా డేటా ప్రకారం బీఎస్ఎన్ఎల్ మే నెలలో 1.35 లక్షల వినియోగదారులను కోల్పోయింది. ఈ ఫ్లాష్ సేల్ సంస్థకు కొత్త వినియోగదారులను ఆకర్షించడానికి ఒక కొత్త నిర్ణయంగా చెప్పవచ్చు. వినియోగదారులకు మెరుగైన కనెక్టివిటీని అందించడానికి బీఎస్ఎన్ఎల్ లక్ష కొత్త మొబైల్ టవర్స్‌ను ఏర్పాటు చేయాలని లక్ష్యంతో ఉంది. వినియోగదారుల అనుభవాన్ని మరింత మెరుగుపరచడానికి, బీఎస్ఎన్ఎల్ 13,000 కోట్ల రూపాయల పైగా పెట్టుబడులు పెట్టి కొత్త టవర్స్‌ను ఏర్పాటు చేయడానికి సిద్ధమైంది. అదనంగా, సంస్థ హైదరాబాద్‌లో 5 ఫిక్స్డ్ వైర్‌లెస్ యాక్సెస్ సేవను ప్రారంభించింది. దక్షిణ భారతదేశంలోని బెంగళూరు సహా అనేక నగరాల్లో దీన్ని విస్తరించడానికి ప్లాన్ చేస్తున్నారు.

లక్ష కొత్త టవర్స్


బీఎస్ఎన్ఎల్ తన నెట్‌వర్క్ కవర్‌ను మెరుగుపరచడానికి, యూనియన్ కేబినెట్ ఆమోదం పొందిన తర్వాత లక్ష కొత్త 4, 5 మొబైల్ టవర్స్‌ను ఏర్పాటు చేయడానికి సిద్ధమైంది. గత సంవత్సరం, ఈ సంస్థ టవర్స్‌ను ఏర్పాటు చేయడానికి సిద్ధమైంది. ఇప్పటివరకు 70,000 పైగా టవర్స్‌ను విజయవంతంగా ప్రారంభించింది. ఇవి పూర్తయిన తర్వాత, బీఎస్ఎన్ఎల్ ఆయా ప్రాంతాల్లో కనెక్టివిటీని గణనీయంగా పెంచుకోవడానికి సిద్ధమవుతోంది.

# భారత్‌ను వీడనున్న 3500 మంది మిలియనీర్లు..
# ప్రైవేట్ వెల్త్ మైగ్రేషన్ రిపోర్టులో వెల్లడి




ఇంటర్నెట్ డెస్క్: ఈ ఏడాది భారత్ నుంచి 3500 మంది మిలియనీర్లు విదేశాలకు తరలిపోనున్నారు. హెన్లీ ప్రైవేట్ వెల్త్ మైగ్రేషన్ నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. భారత్ నుంచి ఇలా వ్యక్తిగత సంపద తరలిపోవడం గతేడాదితో పోలిస్తే కాస్త తగ్గినట్టు కూడా నివేదికలో వెల్లడైంది. 2023లో 5,100 మంది మిలియనీర్లు భారత్ నుంచి వెళ్లిపోతారని అంచనా వేశారు. 2024లో 4,300 మంది తరలిపోతారని అప్పట్లో పేర్కొన్నారు2014 నుంచి 2024 మధ్య కాలంలో భారత్‌లో మిలియనీర్‌ల సంఖ్య 72 శాతం పెరిగిందని హెన్లీ అండ్ పార్టనర్స్ సంస్థ అంచనా వేసింది. ఇక మిలియనీర్ల వలస కారణంగా ఈ ఏడాది మొత్తం 26.2 బిలియన్ డాలర్ల వ్యక్తిగత సంపద దేశం దాటిపోనుంది. స్థూలంగా చూస్తే మాత్రం దేశం విడిచి వెళ్లాలనుకుంటున్న మిలియనీర్‌ల సంఖ్య పెరుగుతోందని నివేదిక తేల్చింది.కనీసం 1 మిలియన్ డాలర్లను తక్షణం పెట్టుబడి పెట్టగలిగిన వారినే ఈ నివేదిక కోసం పరిగణనలోకి తీసుకున్నారు. ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా 1.42 లక్షల మంది మిలియనీర్లు తమ మాతృదేశాలను వీడనున్నారు. యూకే నుంచి ఈసారి నికరంగా అత్యధిక వ్యక్తిగత సంపద తరలిపోయే అవకాశం ఉంది.ఈ నివేదిక ప్రకారం, బ్రిటన్ నుంచి ఈసారి ఏకంగా 16,500 మంది మిలియనీర్ల తరలిపోనున్నారు. 7,800 మంది చైనా మిలియనీర్లు దేశాన్ని వీడనున్నారు.ఇక విదేశీ సంపదను ఆకర్షించడంలో యూఏఈ ఎప్పటిలాగే టాప్‌లో నిలిచింది. ఈ ఏడాది 9,800 మంది మిలియనీర్లు యూఏఈకి తమ మకాం శాశ్వతంగా మార్చనున్నారు. యూఏఈ తరువాతి స్థానంలో అమెరికా ఉంది. ఈ ఏడాది అమెరికాకు 7800 మంది తరలి వెళ్లే అవకాశం ఉంది. బ్రెగ్జిట్‌కు పూర్వం మిలియనీర్లను ఆకర్షించే దేశంగా ఉన్న బ్రిటన్ ఆ తరువాత తన ప్రాభవాన్ని కాస్త కోల్పోయింది. మిలియనీర్ల వలసలకు ప్రధాన కారణం పన్ను సంస్కరణలేనని కూడా ఈ నివేదిక తేల్చింది.


# మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడా.. ఈ తప్పు అస్సలు చేయొద్దు




ఇంటర్నెట్ డెస్క్: అధిక రాబడుల కోసం ప్రస్తుతం అనేక మంది మ్యూచువల్ ఫండ్స్ వైపు మళ్లుతున్నారు. కొందరు ఏకంగా ప్రావిడెంట్ ఫండ్ నిధులను కూడా మ్యూచువల్ ఫండ్స్‌లోకి మళ్లిస్తున్నారు. అయితే, ఇది చాలా ప్రమాదకరమని ఫైనాన్షియల్ అడ్వైజర్లు చెబుతున్నారు. జీవిత చరమాంకంలో అక్కరకు రావాల్సిన సొమ్ము విషయంలో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులపై రాబడి 10 శాతం నుంచి 13 శాతం మధ్య ఉండొచ్చన్న నమ్మకం జనాల్లో ఉంది. అయితే, కచ్చితంగా రాబడులు ఈ స్థాయిలో ఉంటాయన్న గ్యారెంటీ ఏమీ లేదని అభిషేక్ కుమార్ అనే ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ తాజాగా లింక్డ్ఇన్‌లో ఓ పోస్టు పెట్టారు. మార్కెట్ ఆధారిత పెట్టుబడి సాధనాల పని తీరు ఇది కాదని స్పష్టం చేశారు. 15 ఏళ్ల పాటు ఫైనాన్షియల్ ప్లానింగ్ రంగంలో పని చేసిన అనుభవంతో ఈ విషయాన్ని చెబుతున్నానని అన్నారు.అధిక రాబడులపై విశ్వాసంతో అనేక మంది ఇలాంటి రిస్కీ చర్యలకు దిగుతున్నారని అన్నారు. కొందరు ఫైనాన్షియల్ అడ్వైజర్లు కూడా పెట్టుబడిదారులకు ఇలాంటి సలహాలు ఇస్తున్నారని వాపోయారు. పీఎఫ్ నిధులను మ్యూచువల్ ఫండ్స్‌లోకి మళ్లించడం చాలా ప్రమాదకరమైన చర్య అని హెచ్చరించారు. 'మీ రిటైర్మెంట్ తరువాత ఆర్థిక భద్రత కోసమే పీఎఫ్. ఇందులో పెట్టుబడి నెమ్మదిగానే వృద్ధి చెందాలి. భద్రత, పన్ను రాయితీ ఉండాలి. అధిక రాబడుల కోసం ఈ డబ్బును రిస్కీ పెట్టుబడుల్లోకి మళ్లిస్తే మీ భవిష్యత్తే ప్రమాదంలో పడొచ్చు' అని హెచ్చరించారు.

సంపద సృష్టికి మ్యూచువల్ ఫండ్స్ అద్భుత సాధనాలే అయినప్పటికీ రాబడిపై ఎలాంటి గ్యారెంటీలు ఉండవని అన్నారు. ఒక ఏడాది 15 శాతంగా ఉన్న రాబడి, మరుసటి ఏడాది మైనస్ రెండు శాతానికి పడిపోయినా ఆశ్చర్యపోనక్కర్లేదని అన్నారు. వినియోగదారుల ప్రయోజనాలకు తొలి ప్రాధాన్యం ఇవ్వని వారే ఇతరులకు మ్యూచువల్ ఫండ్స్ రాబడి కచ్చితంగా ఉంటుందన్న హామీ ఇస్తారని అన్నారు. మార్కెట్ కుప్పకూలినప్పుడు నష్టపోయేది కస్టమర్లే అన్న విషయాన్ని ఫైనాన్షియర్ అడ్వైజర్లు మర్చిపోకూడదని హితవు పలికారు.

# జేఎస్‌డబ్ల్యూ చేతికి అక్జో నోబెల్




న్యూఢిల్లీ: సజ్జన్ జిందాల్ నేతృత్వంలోని జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ పెయింట్స్ వ్యాపారంలో తన స్థానాన్ని పటిష్ఠం చేసుకుంటోంది. ఇందులో భాగంగా నెదర్లాండ్స్ కేంద్రంగా పనిచేసే పెయింట్స్ సంస్థ అక్జో నోబెల్ భారత అనుబంధ సంస్థ అక్జో నోబెల్ ఇండియాను రూ.12,915 కోట్లకు జేఎసడబ్ల్యూ పెయింట్స్ కొనుగోలు చేస్తోంది. ఇందుకోసం ఆ కంపెనీ ఈక్విటీలో నెదర్లాండ్స్ కంపెనీకి ఉన్న 74.76 శాతం వాటాను రూ.8,986 కోట్లకు కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. ప్రజల వద్ద ఉన్న మిగతా 25 శాతం వాటా షేర్లను ఒక్కో షేరు రూ.3,417.77 చొప్పున రూ.3,929.06 కోట్లకు కొనుగోలు చేసేందుకు త్వరలో ఓపెన్ ఆఫర్ ప్రకటించనుంది.మన దేశ పెయింట్స్ రంగంలో ఇప్పటి వరకు ఇదే అతిపెద్ద టేకోవర్‌గా భావిస్తున్నారు. అక్జో నోబెల్ ఇండియా కొనుగోలుతో దేశ పెయింట్స్ మార్కెట్లో ఏషియన్ పెయింట్స్, బెర్జర్ పెయింట్స్, కన్సాయ్ నెరోలాక్ తర్వాత జేఎస్‌డబ్ల్యూ పెయింట్స్ నాలుగో అతిపెద్ద కంపెనీగా ఆవిర్భవించనుంది. ఆదిత్య బిర్లా గ్రూప్‌తో సహా ఇటీవల అనేక కంపెనీలు పెయింట్స్ వ్యాపారంలోకి ప్రవేశించాయి. దీంతో ఈ పోటీని ఎదుర్కోవడంతో పాటు తన స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకునేందుకు అక్జో నోబెల్ కొనుగోలు ఉపయోగపడుతుందని జేఎస్‌డబ్ల్యూ పెయింట్స్ భావిస్తోంది. అయితే ఈ డీల్‌కు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ)తో పాటు పలు రెగ్యులేటరీ సంస్థల అనుమతి అవసరం.

# ఉజ్బెకిస్థాన్ జార్మెడ్ విశ్వవిద్యాలయంతో అపోలో మెడ్‌స్కిల్స్ జట్టు

హైదరాబాద్: అపోలో హాస్పిటల్స్ గ్రూప్‌నకు చెందిన అపోలో మెడ్‌స్కిల్స్ లిమిటెడ్.. ఉజ్బెకిస్థా న్‌కు చెందిన జార్మెడ్ విశ్వవిద్యాలయంతో జట్టు కట్టింది. ఒప్పందంలో భాగంగా భారతీయ విద్యార్థులకు 2025-26 విద్యా సంవత్సరం నుంచి 'జాప్ ఎంబీబీఎస్ ప్రొగ్రామ్' ద్వారా వైద్య విద్యను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు అపోలో మెడ్‌స్కిల్స్ సీఈఓ శ్రీనివాస్ రావు పులిజాల తెలిపారు. విదేశాల్లో వైద్య విద్యను అభ్యసిస్తున్న భారతీయ విద్యార్థులు భాషాపరంగా పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దీన్ని దృష్టిలో ఉంచుకుని వీరి కోసం ప్రత్యేకంగా ఆంగ్ల మాధ్యమంలో అనుభవజ్ఞులైన భారతీయ అధ్యాపక బృందంతో విద్యను బోధించనున్నట్లు ఆయన చెప్పారు. ఉజ్బెకిస్థాన్‌లో జార్మెడ్ విశ్వవిద్యాల యానికి చెందిన రెండు క్యాంప్‌సలైన సమర్‌ఖండ్, బుఖారాల్లో ఎంబీబీఎస్ కోర్సు అందుబాటులో ఉంటుందని శ్రీనివాస్ తెలిపారు. అయితే జార్మెడ్ విశ్వవిద్యాలయంలో చేరాలనుకునే విద్యార్థులు నీట్ పరీక్షలో ఉత్తీర్ణులు కావాల్సి ఉంటుందన్నారు. జాతీయ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ ఎంబీబీఎస్ కోర్సును అపోలో మెడ్‌స్కిల్స్ డిజైన్ చేసిందని ఆయన వివరించారు. ఐదేళ్ల అకాడమిక్ కరిక్యులమ్‌తో పాటు ఒక సంవత్సరం హాస్పిటల్ అప్రెంటిషిపను అందించనున్నట్లు ఆయన చెప్పారు. విదేశాల్లో వైద్య విద్యను అభ్యసించిన విద్యార్థులు భారత్‌లో ప్రాక్టీస్ చేసేందుకు ఎఫ్ఎంజీఈ/నెక్ట్స్ పరీక్షల్లో ఉత్తీర్ణులు కావాల్సి ఉంటుందన్నారు.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006